


www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2010/33229

సంపుటి : 16 | సంచిక :299 | గురువారం 15.01.2026 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

## దేశ నిర్మాణంలో రైతులే బలమైన
# భాగస్వాములు

### దేశ ప్రజలకు మోదీ సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రతి ఇంట్లో కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్ష


ఈ పండుగ మన అన్నదాతలది అని వ్యాఖ్య 02



"ముఖ్యంగా ఈ పండుగ మన అన్నదాతలది. నిరంతరం శ్రమిస్తూ దేశానికి అన్నం పెట్టే మన రైతు సోదరులకు కృతజ్ఞతలు తెలుపుకునే పవిత్ర సమయమిది. వారి శ్రమలో భాగస్వామ్యం పంచుకుంటూ సమాజాన్ని సుభిక్షం చేసుకోవడం మనందరి బాధ్యత. ఈ మకర సంక్రాంతి మీ జీవితంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపాలని, మీ భవిష్యత్తు ఎల్లప్పుడూ సానుకూలతతో, ప్రకాశవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని, మీ ప్రతి ప్రయత్నం విజయవంతమై సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని మనసారా కోరుకుంటున్నాను." అని మోదీ ఆకాంక్షించారు.

# పాలక్ పన్నీర్..1.8 కోట్లు!

- అమెరికాలో ఫలించిన న్యాయపోరాటం
- సెటిల్ మెంట్ ద్వారా పరిహారం
- మాస్టర్స్ డిగ్రీలు ఇచ్చేందుకు ఓకే 02



# అసలేం జరుగుతోంది?

## పోలీసుల అదుపులో నలుగురు ఎన్టీవీ జర్నలిస్టులు

## చానల్ యాజమాన్యం, సీఈవోపైనా కేసులు?

జర్నలిస్టులు ఏమైనా టెర్రరిస్టులా?

అక్రమ అరెస్ట్‌లను తీవ్రంగా ఖండించిన ప్రముఖులు.. 02

యూట్యూబ్ చానళ్లను పరిశీలిస్తున్న టీమ్ పరారీలో మరికొందరు..

ఫోన్లు స్విఛాఫ్ కొన్ని చానళ్లు ఇప్పటికే ఆ వీడియోలు డిలీట్ చేసినట్టు టాక్





## తప్పు లేకుంటే ఎందుకు పారిపోతున్నారు?

- ది ఫ్యూచర్ ఈజ్ ఫీమేల్.. మహిళలను కించపరిస్తే దేశానికే నష్టం: సీపీ సజ్జనార్
- ఇల్లు-ఉద్యోగం రెండింటినీ సమతుల్యం చేస్తున్నారు మహిళలు 02
- సమాజాన్ని ముందుకు తీసుకెళ్తున్న మహిళలపై దాడులు ప్రగతిపై దాడులే.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

**మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనం : జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ ఫైర్**

- నోటీస్ ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యమా
- రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రేవంత్ సర్కార్
- ఇదేనా మీ 'మొహబ్బత్ కీ దుకాన్' అంటూ రాహుల్ గాంధీకి ప్రశ్న 03
- మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనమని విమర్శ

ముగ్గురి అరెస్టుపై కేటీఆర్ ఆగ్రహం



# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ సరికాదు


జర్నలిస్టుల అరెస్టు ప్రభుత్వానికి మంచిది కాదు..

- సిట్ అధికారులు సంయమనం పాటించాలని : జగ్గారెడ్డి
- అలాంటి వార్తలు వేయడం సమాజానికి మంచిది కాదు
- ఇలాంటి వార్తలు రాయడాన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాల్సిందే 02



## 18న ఏదులాపురంలో
# సీఎం పర్యటన

మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల ప్రారంభానికి హాజరు




- ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహాసభల్లో పాల్గొననున్నారు 03
- జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

# మీకు డిపాజిట్లు రాలేదు..

### మహబూబ్‌నగర్‌లో మంత్రుల పర్యటన.. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- 20 రోజుల్లో మునిసిపల్ ఎన్నికలు, త్వరలో జిల్లా పరిషత్ ఎన్నికలు
- కురుమూర్తి స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు కోసం రూ.140 కోట్లు
- దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ లేదని..
- ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పనులు పూర్తయినట్లు బీఆర్ఎస్ చెబుతోందని.. 03
- కానీ రూ.27000 కోట్లు మాత్రమే ఎలా ఖర్చు అయింద





## థయ్‌లాండ్‌లో ఘోర విషాదం..

- 22 మంది మృతి.. 30 మందికి పైగా గాయాలు
- హైస్పీడ్ రైలుపై పడ్డ భారీ క్రేన్..
- పట్టాలు తప్పిన బోగీలు రాపిడికి భారీగా
- చెలరేగిన మంటలు కొనసాగుతున్న సహాయక చర్యలు 05


# ఐరిస్!

## డ్రగ్స్ ముఠాకు చెక్

అక్రమార్కులను తరిమేందుకు కొత్త అస్త్రం దూకుడు పెంచిన ఈగల్ టీమ్

నకిలీ పాస్ పోర్టుల గుర్తింపు తిప్పవేసిన విదేశీయులను తిరిగి పంపే యత్నాలు

మళ్లీ మళ్లీ భారత్ రాకుండా చర్యలు 02



# అసలేం జరుగుతోంది?

## బ్యాంకాక్ వెళ్తుండగా జర్నలిస్టుల అరెస్టు..

## ఇప్పటి వరకు స్పందించని పోలీసులు..

**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన మహిళా ఐఏఎస్ ఆఫీసర్, మంత్రిపై వచ్చిన కథనాల వ్యవహారంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మహిళా ఐఏఎస్ అధికారి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఇటీవల కథనాలు ప్రసారం చేయడంపై పలు న్యూస్ చానల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ పై హైదరాబాద్‌లో సీసీఎస్‌లో కేసు నమోదు కాగా ఈ కేసు దర్యాప్తుపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సిట్ ఏర్పాటైన గంటల వ్యవధిలోనే ఈ కేసులో ఎన్‌టీవీ యాజమాన్యం మంగళవారం సాయంత్రం క్షమాపణలు కోరింది. దీంతో ఈ సమస్య ముగిసిపోయిందని అందరూ భావించారు. కానీ గత అర్ధరాత్రి ఊహించని ట్విస్ట్ నమోదైంది. కుటుంబంతో విదేశాలకు వెళుతున్న ఎన్‌టీవీ ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్‌ను హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో పోలీసులు అరెస్ట్ చేశారు. అదే చానల్‌కు చెందిన మరో ఇద్దరు రిపోర్టర్లు పరిపూర్ణాచారి, సుధీర్‌లను కూడా పోలీసులు అరెస్టు అదుపులోకి తీసుకున్నారు. కాగా, వాళ్ళను ఎక్కడ ఉంచారో



చెప్పకుండా నేరుగా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేలా ప్లాన్ చేస్తున్నట్టు టీవీ యాజమాన్యం అనుమానం వ్యక్తం చేసింది.

**అజ్ఞాతంలో యాజమాన్యం!**

పండగ పూట రిపోర్టర్ల అరెస్టు వ్యవహారం రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఈ పరిణామాలతో ఛానల్ యజమాన్యం నరేంద్ర చౌదరి, సీఈవో రాజశేఖర్ అజ్ఞాతంలో ఉన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తమ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేస్తే ఈ వార్తను ఎన్టీవీ కనీసం టెలికాస్ట్ కూడా చేయడం లేదని సొంత ఉద్యోగులు అరెస్టు అయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదనే విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఈ వ్యవహారంలో కిందిస్థాయి ఉద్యోగులను బలిపశువులను చేయబోతున్నారా అనే సందేహాలను నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు.

**అసలేం జరుగుతోంది?:**

మహిళా ఐఏఎస్ పై కథనం విషయం ప్రస్తుతం పూర్తిగా పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఓ మంత్రిని ఇరుకున పెట్టేందుకు ప్రభుత్వంలోని పెద్దలే ఈ కథనాలకు ఆజ్యం పోశారని ప్రతిపక్షం విమర్శిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయగా ఇంతలోనే ఓ న్యూస్ చానల్ కు సంబంధించిన రిపోర్టర్లను అరెస్టు చేయడంతో ఇది జర్నలిస్టులపై సర్కార్ కక్ష సాధింపు చర్యలు అని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. అయితే ఈ అరెస్టులపై ఇటు పోలీసులు అటు సంస్థ యాజమాన్యం ఇప్పటి వరకు స్పందించకపోవడంతో సోషల్ మీడియాలో రకరకాల రూమర్స్ స్ప్రెడ్ అవుతున్నాయి. ఇంతకీ ఈ కేసులో ఏం జరుగుతోంది అసలు వాస్తవాలు ఏమిటి అనేది పోలీసులు, సదరు న్యూస్ చానల్ సంస్థ యాజమాన్యం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# దేశ నిర్మాణంలో రైతులే బలమైన భాగస్వాములు

**ఢిల్లీ :** రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని.. వారిని మరింత శక్తిమంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పని చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి మురుగన్ ఇంట్లో జరిగిన పొంగల్ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టెల పొయ్యిపై పొంగల్ వండారు. బస వన్నలకు ఆహారం పెట్టారు. సంబురా లకు హాజరైన ప్రత్యేక ఆహ్వానితులతో ముచ్చటించి, వారితో ఫొటోలు దిగారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ వేడు కల్లో మాజీ గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత వంటివి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. గతేడాది తాను తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనట్లు గుర్తు చేసుకున్నారు. వెయ్యి సంవ త్సరాల పురాతనమైన గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన, పంబన్ వంతెన ప్రారంభో త్సవ సమయాల్లో తమిళుల చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రపతిని కలిసిన అమెరికా రాయబారి

**ఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియా గోర్ కలిశారు. ఈ సందర్భంగా రాయబారిగా నియమితులైన పత్రాలను అందజేశారు. సెర్గియో గోర్ నుంచి అక్రిడిటేషన్ పత్రాలను ద్రౌపది ముర్ము స్వీకరించారు. సెర్గియా గోర్ ట్రంప్ సన్నిహితుడు. గతేడాది భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు. ఇటీవలే రాయబారిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రధాని మోడీని కలిసిన ఫొటోను ఎక్స్‌లో పెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత్-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని.. త్వరలోనే అన్ని సంద్ధకుంటాయని చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కూడా జరుగుతుందని తెలిపారు. అన్నట్టుగానే తాజాగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో-భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది. వాణిజ్యం, కీలక ఖనిజాలు, అణు సహకారం, రక్షణ, ఇంధనం గురించి చర్చించినట్లు జైశంకర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఇతర విషయాలపై కూడా ఒకరితో ఒకరు సంప్రదింపులు జరుపుతూ ఉండాలని అంగీకరించినట్లుగా స్పష్టం చేశారు. త్వరలోనే రెండు దేశాలు ఒక కీలక నిర్ణయం తీసుకోబోతుందని ఎక్స్‌లో వెల్లడించారు.

# బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశం లేదు..

- టీవీకేను బలవంతంగా ఎన్డీయేలోకి చేర్చుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుంది..
- బీజేపీతో ఎట్టి పరిస్థితిలో పొత్తు పెట్టుకునే అవకాశం లేదని టీవీకే క్లారిటీ..
- జన నాయగన్ సినిమాకి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా కేంద్రం అడ్డుకుంటుంది: టీవీకే




**తమిళనాడు :** విజయ్ దళపతి పార్టీని ఎన్డీయేలోకి బలవంతంగా చేర్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే అతడు నటించిన 'జన నాయగన్' సినిమాకి సకాలంలో సెన్సార్ సర్టిఫికెట్ లభించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పొత్తుపై తమిళగ వెట్రి కళగం పార్టీ రియాక్ట్ అయింది. రాజకీయంగా తమను అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్డీయేతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ క్లారిటీ ఇచ్చారు. టీవీకేను కూల్చడానికి ఎన్ని కుట్రలు చేసినా తమ పార్టీ సిద్ధాంత వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని వెల్లడించారు. టీవీకేకు బీజేపీ సిద్ధాంత శత్రువు అయితే డీఎంకే రాజకీయ శత్రువని పేర్కొన్నారు. ఇక, 'జన నాయగన్' సినిమా వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందనను స్వాగతిస్తున్నట్లు టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ తెలిపారు. దీనిని తమ పార్టీకి కాంగ్రెస్ ఇస్తున్న స్నేహపూర్వక సపోర్టుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఆ పార్టీతో పొత్తు విషయంపై తమ పార్టీ అధినేత విజయ్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట దుర్ఘటన వ్యవహారంలోనూ విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేయడంతో.. అతడ్ని ఇరకాటంలో పెట్టి పొత్తుకు ఒప్పించాలని బీజేపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ సరికాదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహిళా ఐఏఎస్ అధికారిపై అసభ్యకర కథనాలు ప్రసారం చేసిన కేసులో ఓ వార్తా సంస్థ ఇన్ పుట్ ఎడిటర్, ఇద్దరు జర్నలిస్టులను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందిస్తూ.. జర్నలిస్టుల అరెస్ట్‌ను వెంటనే ఆపాలంటూ సీపీ సజ్జనార్, డీజీపీ శివధర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యారెక్టర్‌ను దెబ్బతీస్తూ మీడియాలో వచ్చిన అసత్య కథనాలను తాను ఇప్పటికే ఖండించినట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తూ నాయకులు, అధికారులపై మీడియాలో ఇష్టానుసారంగా కథనాలను ప్రసారం చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. మీడియా అనుసరించే ఇలాంటి చర్యలు నాయకులు, అధికారులు సహా ఎవరికైనా ఇబ్బందే అని.. ఈ విషయాన్ని అందరూ ఖండించాల్సిందే అని ఆయన




చెప్పుకొచ్చారు. అదే సమయంలో ఈ కథనాలకు సంబంధించి జర్నలిస్ట్‌అబశ్రీశ్రీలను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం మంచిది కాదన్నారు. గతంలో కూడా ఎన్నోసార్లు నాయకులు, అధికారులపై యుట్యూబ్ ఛానళ్లలో అసత్య, తప్పుడు కథనాలు ప్రసారం అయ్యాయని.. అప్పుడు ఇంత తీవ్ర స్థాయిలో స్పందించలేదు కదా? అని ప్రశ్నించారు. మీడియాలో దురుద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రసారం చేసినంత మాత్రాన నాయకులు, అధికారుల క్యారెక్టర్‌కు ఎలాంటి నష్టం జరగదని జగ్గారెడ్డి అన్నారు. జర్నలిస్ట్‌లకు నోటీస్‌లు ఇచ్చి వ్యక్తిగతంగా వారి వివరణ తీసుకుంటే బాగుండేదని అన్నారు జగ్గారెడ్డి. ఈ మేరకు జర్నలిస్ట్‌ల అరెస్ట్ విషయంలో ఏర్పాటు చేసిన సిట్‌కు నాయకత్వం వహిస్తున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, డీజీపీ శివధర్ రెడ్డిలను మీడియా ద్వారా జగ్గారెడ్డి కోరారు. ఇలా జర్నలిస్ట్‌లను అర్ధరాత్రి అరెస్ట్ చేయడం వల్ల జర్నలిస్ట్‌లు భయాందోళనలకు గురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వారి అరెస్ట్ వల్ల రాష్ట్రంలో ఒక యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌ల అరెస్ట్‌లను వెంటనే ఆపాలని... ఈ విషయాన్ని సిట్ బృందం, డీజీపీ పరిగణలోకి తీసుకోవాలని జగ్గారెడ్డి వినతి చేశారు.

# పాలక్ పన్నీర్.. 1.8 కోట్లు!

**వాషింగ్టన్ డీసీ:** ఒకే ఒక్క కాల్ జీవితాన్ని మార్చేస్తుంది.. ఇది ఒకప్పటి ఐడియా అడ్వ ర్టైజ్‌మెంట్. అట్లాగే ఒకే ఒక్క కేసు 1.8 కోట్ల పరిహారం తెచ్చి పెట్టింది. అదో పాలక్ పన్నీర్ కేస్. భారత్కు చెందిన ఆదిత్య ప్రకాశ్, ఊర్మి భట్టాచార్య రెండేళ్ల క్రితం యూనివర్సిటీ ఆఫ్ కొలరాడోలో పీహెచ్‌ఎ చదువుతున్న సమయంలో వారికి వివక్ష ఎదురైంది. 2023 సెప్టెంబరు 5న ఆదిత్య లంచ్ కోసం మైక్రోవేవ్ పాలక్ పనీర్ వేడి చేసుకునేందుకు తన డిపారెట్మెంట్ స్టాఫ్ క్యాంటీన్ కు వెళ్లారు. అయితే, అక్కడ ఉన్న సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. ఇలాంటి ఆహారంతో భరించలేని వాసన వస్తోందని,దాన్ని వేడి చేయొద్దని చెప్పారు. దీంతో అవ మానానికి గురైన ఆదిత్య తన స్నేహితురాలు ఊర్మితో కలిసి యూనివర్సిటీ యాజమాన్యాని కి ఫిర్యాదు చేయగా వాళ్లూ పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే ఎలాంటి కారణం చెప్పకుండా ఊర్మిని టీచింగ్ అసిస్టెంట్ జాబ్ను తొలగించా రు. మరోవైపు, వీరి మాస్టర్స్ డిగ్రీలను ఇచ్చేం దుకు విశ్వవిద్యాలయం నిరాకరించడంతో వీరిద్దరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొలరాడోలోని డిస్ట్రిక్ట్ కోర్టులో సివిల్ దావా వేశారు. దీంతో దిగొచ్చిన యూనివర్సిటీ వీరితో సెటిల్మెంట్ చేసుకుంది. భారతీయ విద్యార్థు లకు 2లక్షల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ. 1.8కోట్లు) పరిహారం చెల్లించేందుకు అం గీకరించింది. వారి మాస్టర్స్ డిగ్రీలను కూడా ఇచ్చేస్తామని తెలిపింది. దీంతో ఈ వివాదం సద్దుమణిగింది.

# 80వ స్థానానికి భారత్

**ఢిల్లీ :** భారత పాస్పోర్ట్ బలపడింది. హెన్లీ పాస్పోర్ట్ ఇండెక్స్-2026లో భారత్ ఐదు స్థానాలు ఎగబాకి 80వ స్థానానికి చేరుకుంది. భారత పాస్పోర్ట్ ప్రస్తుతం 62 దేశాలకు వీసా లేకుండా లేదా వీసా ఆన్ అరైవల్ తో ప్రయాణించే అవకాశం ఉంది. గత ఏడాదితో పోలిస్తే భారతీయుల అంతర్జాతీయ ప్రయాణ స్వేచ్ఛలో గణనీయమైన మెరు విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్లో సింగపూర్ ప్రపంచంలోనే అత్యంత శక్తి మంతమైన పాస్పోర్ట్గా నిలిచింది. సింగపూర్ పౌరులకు 192 దేశాలకు వీసా ఫ్రీ యాక్సెస్ లభిస్తోంది. జపాన్,దక్షిణ కొరియా రెండో స్థానంలో నిలిచి 188 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే అవకాశం పొందాయి. అత్యల్ప శక్తివంతమైన పాస్పోర్ట్గా ఆఫ్ఘనిస్తాన్ చివరి స్థానంలో నిలిచింది. ఆ దేశ పాస్పోర్ట్ కేవలం 24 దేశాలకు మాత్రమే వీసా లేకుండా వెళ్లగల పరిస్థితి ఉంది. ప్రపంచ ప్రయాణ స్వేచ్ఛలో అసమానతలు పెరుగుతున్నాయని హెన్లీ నివేదిక స్పష్టం చేసింది. యూరప్ దేశాలు టాప్ ర్యాంకుల్లో ఆధిపత్యం కొనసాగిస్తుండగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఐదో స్థానానికి చేరి ప్రత్యేక గుర్తింపు సాధించింది. యూఏఈ పాస్పో ర్ట్ తో 184 దేశాలకు వీసా అవసరం లేదు. ఆస్ట్రేలియా, కెనడా, మలేసియా టాప్-10లో చోటు దక్కించుకోగా, అమెరికా మళ్లీ పదో స్థానానికి చేరింది. భారత్ ర్యాంకు మెరుగుపడటం దేశానికి పెరుగుతున్న అంతర్జా తీయ ప్రాధాన్యతకు సంకేతమని నిపుణులు చెబుతున్నారు.

# ఐరిస్! డ్రగ్స్ ముఠాకు చెక్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** విద్య, ఉపాధి కోసం దేశానికి వచ్చాం అంటారు. పైకి వారి పనిలో ఉన్నట్లుగా కనిపించినా, వారి అసలు రూపం వేరే ఉంటుంది. వీసా గడువు ముగిసి నప్పటికీ వారు దేశాన్ని వీడకుండా ఇక్కడే ఉంటూ దందా సాగిస్తూ ఉంటారు. దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి నగరాల్లోని యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తూ అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తూ ఉంటారు. అయితే.. ఈ రకంగా దేశంలోకి వచ్చిడ్రగ్స్ (మాదక ద్రవ్యాల) దందాతో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న విదే శీయులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం 'ఐరిష్ల అస్త్రాన్ని ప్రయోగి స్తోంది. ముఖ్యంగా అక్రమంగా ఉంటున్న నైజీరియన్ల విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాంది. ఈ విషయంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఈగల్) పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్ట వేసి, డ్రగ్స్ దందా కొనసాగిస్తున్న వారిని నియం త్రించేందుకు డిపోర్టేషన్ (స్వదేశానికి తిప్పి పంపడం) ప్రక్రియకు పదును పెడుతున్నారు. ఈ సమయంలోనే ఐరిస్ అస్త్రాన్ని ప్రయోగిం చడం ద్వారా నకిలీ పాస్ పోర్టులతో మళ్లీ దేశంలోకి అడుగుపెట్టే అవకాశం లేకుండా చేస్తున్నారు.

**వీసా గడువు ముగిసేలోపే**

దేశంలో మాదక ద్రవ్యాల దందాలో ఆఫ్రికా దేశస్థులే కీలకం. ముఖ్యంగా నైజీరి యన్లే ఎక్కువ. స్టూడెంట్, మెడికల్, టూరిస్ట్ లాంటి వీసాలతో అడుగు పెడుతున్న వీరిలో కొం దరు కేవలం డ్రగ్స్ దందా కోసమే వస్తున్నారు. దిల్లీ, ముంబయి, బెంగళూరు, గోవా, హైదరాబాద్ వంటి నగరాల్లో తిష్ఠవేసి, దందా సాగిస్తున్నారు. ఇలా దేశంలోకి అడు గుపెట్టిన వెంటనే సంబంధిత ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎస్ఆర్ఆర్వో)లో తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయించాలి. వీసా గడువు ముగిసేలోపు తిరిగి వెళ్లిపోవాలి. అయితే కొందరు మాత్రం వీసా గడువు ముగిసినా వెళ్లిపోకుండా దేశంలో అక్రమంగా ఉండిపోతున్నారు. (ఓవర్ స్టే). డ్రగ్స్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

**ఈగల్ బృందం ప్రత్యేక కార్యాచరణ**

ఇలాంటి వారిని గుర్తించి డిపోర్ట్ చేయడంలో ఈగల్ బృందం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. 'ఓవర్ స్టే పై కొనసాగ తున్న వారిని గుర్తించి ఆయా రాష్ట్రాల పోలీసు లకు అప్పగిస్తోంది. కొద్దిరోజుల క్రితం కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో నిర్వహించిన ఆపరేషన్లో ఇలా 30 మంది. ఆఫ్రికన్లు చిక్కితే వారిలో ఏడుగురిని మాత్రమే హైదరాబాదు తీసుకొచ్చింది. వారి వద్ద డ్రగ్స్ దొరకడంతో అరెస్ట్ చేసింది. మిగిలిన వారిని ఢిల్లీ పోలీసులకు అప్పగించింది. ఢిల్లీ పోలీసులతో పాటు విదేశీ వ్యవహారాల శాఖ వారందరినీ ఆఫ్రికా దేశాలకు పంపే పనిలో నిమగ్నమైంది.

**మరోసారి అడుగుపెట్టే అవకాశం లేకుండా**

ఇలా డిపోర్ట్ అయిన వారిలో కొందరు నకిలీ పాస్పోర్టులపై తిరిగి వచ్చిన దాఖలాలు ఉనా ఉన్నాయి. పలువురు ఆఫ్రికన్లు, ముఖ్యంగా నైజీరియన్లు సెనెగల్ వంటి ఇతర దేశాల పౌరులుగా సకిలీ పాస్పోర్టులు పొంది వచ్చినట్లు వెల్లడైంది. అలాంటి నైజీరియన్లు మరోసారి దేశంలో అడుగుపెట్టే అవకాశం లేకుండా డిపోర్టేషన్ సమయం లోనే వారి బయోమెట్రిక్తోతో పాటు ఐరిస్ సేకరించే విధానాన్ని దేశవ్యాప్తంగా ఎస్ఆర్ ఆర్వో కార్యాలయాల్లో పక్కాగా అమలు చేస్తున్నారు. ఏడాది వ్యవధిలోనే దేశవ్యా ప్తంగా 2,371 మందిని డిపోర్టేషన్పై పంపిస్తే వారిలో 1,470 మంది నైజీరియన్లే ఉండటం గమనార్హం. తెలంగాణ నుంచి గత ఏడాది 76 మందిని ఎస్ఆర్ఆర్ వోద్వారా ఈగల్ బృందం డిపోర్ట్ చేయించింది.

**ఆ కేసు దర్యాప్తులో వెలుగులోనికి**

గత ఏడాది జులైలో హైదరాబాద్ కొంపల్లి లోని ఓ రెస్టారెంట్ నిర్వాహకుడిని ఈగల్ బృందం ఆరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ నుంచి అతడికి వచ్చిన కొరియర్లో కొకైన్ ఉందనే సమాచారంతో ఈగల్ పోలీసులు వల పన్ని అతడిని పట్టుకున్నారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలు వెలుగులోనికి వచ్చాయి. పలు మెట్రో నగరాల్లో మకాం వేసిన నైజీరియన్లతో డ్రగ్ కార్టెల్ను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు.

# తప్పు లేకుంటే ఎందుకు పారిపోతున్నారు?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మహిళా ఐఏఎస్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా కథనాలు ప్రసారం చేశారనే కేసులో ఎన్ టీవీ రిపోర్టర్లను అదుపులోకి తీసుకున్నామని సిటీ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసు ఇన్వెస్టిగేషన్‌కు సహకరించకుండా రాత్రికి రాత్రే దేశం విడిచి పారిపోయే ప్రయత్నం చేస్తుంటే తాము అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇవాళ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన సజ్జనార్.. రిపోర్టర్స్ నుంచి అన్ని వివరాలు సేకరిస్తున్నామన్నారు. సిట్ అంటేనే దర్యాప్తు అని ఇంకా నోటీసులు ఎందుకు ఇవ్వాలి అని ప్రశ్నించారు. రిపోర్టర్లు సక్రమంగా ఉంటే విచారణకు ఎందుకు భయపడుతున్నారు?. ఎన్టీవీ సీఈవో ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? విచారణకు పిలిస్తే ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించారు. విచారణలో కీలకంగా ఉన్నవారు విచారణకు వస్తానని చెప్పి సెల్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారని, బ్యాంకాక్ పేరుతో బయటకు వెళ్తుంటే పట్టుకోకుండా ఉంటామా? తప్పు చేసిన ఎవరినైనా అరెస్టు చేస్తామన్నారు. విచారణకు సహకరించకుంటే ఇళ్లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎక్కడికి వెళ్లినా పట్టుకువచ్చి చట్టం ముందు ప్రవేశపెడతామన్నారు.

# చర్చ అంటేనే బీఆర్ఎస్ నేతలు పారిపోయారు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విమర్శలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అటెన్షన్ డైవర్షన్ డ్రామాలంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మండిపడ్డారు. అలాగే కృష్ణా నదీ జలాల వాటా విషయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను పక్క దోవ పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో అసెంబ్లీలో నదీ జలాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమైనప్పుడు సమాధానం చెప్పలేక బీఆర్ఎస్ నాయకులు సభ నుంచి పారిపోయారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పులకు, దోచుకున్న సొమ్ముకు తాము ఇప్పుడు వడ్డీలు కట్టాల్సి వస్తోందని, ప్రజల ప్రయోజనాల కంటే బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అడ్లూరి ధ్వజమెత్తారు. ఈ పరిణామాలతో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకం కాబోతోందని మంత్రి లక్ష్మణ్ జోస్యం చెప్పారు. గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని, అదే పతనం రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం కావడం ఖాయమని ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు.

బీఆర్ఎస్ పదేళ్ల అస్తవ్యస్త పాలనను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి భంగపాటు తప్పదని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి జరుగుతోందని, పారదర్శకమైన పాలన అందిస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# నల్లగొండకు కార్పొరేషన్ హోదా



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదాను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ సెక్రటరీ కే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాలన పరంగా నల్లగొండకు ఎక్కువ అధికారాలు, విస్తృత పరిధి పెరిగే అవకాశం ఉంది. అభివృద్ధి కోసం నిధులు పెరుగనుండటంతో పాటు రాష్ట్ర, కేంద్ర పథకాలు నేరుగా అందే అవకాశం ఉంది. కొత్త వార్డుల పునర్వ్యవస్థీకరణ అవకాశం, మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థ అమలులోకి రానుంది. కమిషనర్ స్థాయి అధికారుల ద్వారా పాలన మరింత బలోపేతం కానుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్స్ వంటి మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం,పట్టణ ప్రణాళిక, టౌన్ ప్లానింగ్‌లో కార్పొరేషన్ నిబంధనలు అమలు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ విధానాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ మున్సిపాలిటీ కి కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి.

# తెలంగాణ ప్రజకు సంక్రాతి శుభాకాంక్షలు



**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రజలకు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి రైతుల పండుగని, వానాకాలం పంట కోతలు పూర్తయి ధాన్యం ఇంటికి చేరిన సమయంలో గ్రామీణ సంస్కృతి, వ్యవసాయ సాంప్రదాయాలను అనుసరిస్తూ రైతులు జరుపుకునే పండుగ సంక్రాంతి పండుగ అని చెప్పారు. భోగభాగ్యాలతో "భోగి", సకల సంపదలతో "సంక్రాంతి", కన్నుల పండుగగా "కనుమ"ను జరుపుకోవాలన్నారు. భోగి మంటలు, గాలి పటాల సందళ్ళతో పాటుగా తెలంగాణ సంప్రదాయ సకినాల పిండివంటలతో ఈ మూడు రోజులు కోలాహలంగా ఉంటుందని వివరించారు. తమ కుటుంబ సభ్యులు, బంధు, మిత్రులతో కలిసి ప్రజలందరూ సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన తెలిపారు. ప్రమాదకర చైనా మాంజను వాడవద్దని, పంతంగులు ఎగురవేసి సందర్భంలో చాలా జాగ్రత్తగా ఎగురవేయలని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# 18న ఏదులాపురంలో సీఎం పర్యటన

## మున్సిపాలిటిలో అభివృద్ధి పనుల ప్రారంభానికి హాజరు



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహసభల్లో పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ.25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.108 కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. అందులో భాగం గా మద్దులపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరినాదబాబులు మంగళవారం పరిశీలించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన

## మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనం : జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో జర్నలిస్టుల అరెస్టుల్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని విమర్శించారు. నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. అర్ధరాత్రివేళ అరెస్టులు చేయడం సరికాదని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ గారు.. మీరు నడుపుతోన్న మొహబ్బత్ కీ దుకాన్ తెలంగాణశాఖ పౌరుల రాజ్యాంగ హక్కుల్ని ఎలా కాలరాస్తుందో చూస్తున్నారని ఆశిస్తున్నాని ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు.

**అర్ధరాత్రి అరెస్టులు చేయాల్సిన అవసరమేంటి?**

"పండుగ సమయంలో ముగ్గురు జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రతిసారి ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోంది. జర్నలిస్టులను నేరస్తుల్లా వ్యవహరించేందుకు తెలంగాణ డీజీపీ ఎంతగా పట్టుబడుతున్నారో చూడటం దురదృష్టకరం. వారికి నోటీసులు ఇచ్చి, విచారణకు పిలవవచ్చు కదా. అలా చేయకుండా, అర్ధరాత్రి జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి అరెస్టులు చేయడం అత్యుత్సాహం, హద్దులు దాటిన చర్య. అరెస్టు చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని నేను డిమాండ్ చేస్తున్నాను. ఈ కేసుల్లో నమోదు చేసిన సెక్షన్లలో ఏదీ నాన్-బెయిలబుల్ కాదు. అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు ఎందుకు అర్ధరాత్రి అరెస్టులు చేసి జర్నలిస్టులను, వారి కుటుంబాలను భయ-భ్రాంతులకు గురిచేశారు? బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం ఎందుకు? ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. తెలంగాణ డీజీపీ చట్టబద్ధమైన విధానాన్ని పాటించాలని, కాంగ్రెస్ పార్టీ, దాని అప్రామాణిక నాయకత్వం చేస్తున్న చెడు రాజకీయాలకు పాల్పడకుండా ఉండాలని నేను కోరుతున్నాను." అని కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు. ఈ మొత్తం ఘటనలో అసలు లీక్ చేసిన వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించారు.ఇటీవల తెలంగాణ రాజకీయాల్లో మహిళా ఐఏఎస్ ఆఫీసర్ , మంత్రి పై వచ్చిన కథనాలు తీవ్ర దుమారం పేరాయి. ఐఏఎస్ అధికారిణి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఈ కథనాలు రావడంపై కొన్ని న్యూస్ ఛానళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ పై కేసులు నమోదయ్యాయి. దీంతో ఎన్టీవీ యాజమాన్యం బహిరంగంగా క్షమాపణలు తెలిపింది. ఆ తర్వాత ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణాచారి, సుధీర్ లను పోలీసులు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల అరెస్టులను బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల సంఘాలు ఖండించాయి.

# చేపల పెంపకంతో గ్రామీణ ఆర్థిక బలోపేతం



**కోహెడ,ఫ్లాష్ ఇండియా :** మత్స్య సంపద ప్రకృతిలో సహజంగా పెరిగే వనరని, శరీర ఆరోగ్యానికి చేపలు ఎంతో మేలు చేస్తాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో ఉన్న శనిగరం ప్రాజెక్టులో రొయ్య, చేప పిల్లలను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మత్స్య అభివృద్ధి, స్టేట్ సెక్టార్ పథకం ద్వారా 100 శాతం రాయితీపై శనిగరం చెరువులో రొయ్య పిల్లలను విడుదల చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 47 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, వాటిలో 4,144 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలోని 166 చెరువులకు గాను 38 లక్షల 92 వేల చేప పిల్లలు విడుదల చేయాలని ప్రణాళికలు రూపొందించామని, ఇప్పటివరకు 26 చెరువుల్లో 26 లక్షల 69 వేల 860 చేప పిల్లలను విడుదల చేశామని తెలిపారు. ఇందుకు రూ.46.08 లక్షల వ్యయం అయ్యిందన్నారు. అలాగే రెండు చెరువుల్లో 5 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయగా, ఇందుకు రూ.13.58 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు.

**మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు**

శనిగరం రిజర్వాయర్‌లో మొత్తం 9.87 లక్షల చేప పిల్లల విడుదలకు ప్రభుత్వం రూ.17.04 లక్షలు ఖర్చు చేసిందని తెలిపారు. ఈ ఏడాదికి గాను శనిగరం రిజర్వాయర్‌లో 4 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయడానికి ప్రణాళికలు రూపొందించి, ఇందుకోసం ప్రభుత్వం రూ.84 లక్షలు వెచ్చించిందన్నారు. చెరువుల్లో చేప పిల్లలు, రొయ్యలను ప్రభుత్వమే విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. కరీంనగర్, హుస్నాబాద్ చెరువుల్లో మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేప పిల్లలను విడుదల చేశారని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రాజీవ్ రహదారి ప్రధాన రహదారి వద్ద ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కరీంనగర్, గోదావరిఖని తదితర జిల్లాల ప్రజలు హైదరాబాద్ వెళ్లి వస్తూ ఇక్కడ కొనుగోళ్లు చేసేలా ఫిష్ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని, స్థల సేకరణ పూర్తయ్యాక త్వరలోనే మార్కెట్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

**ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి**

శనిగరం చెరువు చేపల పెంపకానికి అనువైనదని, మత్స్య సంపద ద్వారా ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలో ప్రతి చెరువులో చేప పిల్లలు వేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. వరదలకు ముందు చేప పిల్లలు వేయడం వల్ల అవి కొట్టుకుపోతున్నాయని, ఇకపై ప్రతి సంవత్సరం వరదలు తగ్గిన తరువాతే చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాజకీయాలకు అతీతంగా మరింత శ్రమించి ప్రాంత అభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో శానిటేషన్, గ్రీనరీ, ప్లాంటేషన్ పనులు స్థానికంగా చేపట్టాలని కోరారు. బద్దిపడగ మీదుగా గుండారెడ్డి పల్లెకు వెళ్లే రహదారిపై బ్రిడ్జి నిర్మాణం కూడా అతి త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట గ్రంథలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నిర్మలా జయరాజ్, శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య, మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, సర్పంచ్ పిల్లి బాబు, తిప్పారపు సంపత్, రవీందర్ రెడ్డి, కర్ర రవీందర్, కర్ర బిక్షపతి, మాజీ సర్పంచ్ సుతారి కనకయ్య, మత్స్య సొసైటీ నాయకులు, అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మీకు డిపాజిట్లు రాలేదు..

## మహబూబ్‌నగర్‌లో మంత్రుల పర్యటన.. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా భూత్పూర్‌లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం.. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, నల్గొండలు వెనకబడిన జిల్లాలని.. ఇప్పుడు ఈ రెండు జిల్లాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంత బిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. నేడు రూ.60 కోట్లతో మూడు మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. అలాగే కురుమూర్తి స్వామి దేవాలయానికి ఘాట్ రోడ్డు కోసం రూ.140 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.

**కేసీఆర్‌పై విమర్శలు..**

కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పనులు పూర్తయినట్లు బీఆర్ఎస్ చెబుతోందని.. కానీ రూ.27000 కోట్లు మాత్రమే ఎలా ఖర్చు అయిందని ఆయన ప్రశ్నించారు. దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌కు ప్రేమ లేదని.. అందుకే ఇక్కడ కేవలం మూడు సీట్లు మాత్రమే వచ్చాయని మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదని విమర్శించారు.

**కాంగ్రెస్‌కు మద్దతివ్వండి...**

20 రోజుల్లో మునిసిపల్ ఎన్నికలు, త్వరలో జిల్లా పరిషత్ ఎన్నికలు రాబోతున్నాయని కోమటిరెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. ఈ రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చేవారని.. కానీ రేవంత్ రెడ్డి ఎల్లవేళలా ప్రజల్లోనే ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

**బీఆర్ఎస్, కేసీఆర్ ను తిట్టేందుకు కవిత చాలు**

**భూత్పూర్/దేవరకద్ర/కొత్తకోట :** పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన పార్టీ బీఆర్ఎస్ ని తిట్టడానికి ఆయన కూతురు కల్వకుంట్ల కవిత చాలు.. మాకు ఆ అవసరం లేదు అని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమా టోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గంలోని భూత్పూర్, దేవరకద్ర, కొత్తకోట మున్సిపాలిటీలలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల కు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి రాష్ట్ర పశు సం వరదక, మత్స్యశాఖ మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాలలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఏడు లక్షల కోట్ల అప్పులు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అప్పులను తీరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. కేసీఆర్ వల్లే పాలమూరుకు అన్యాయం జరిగిందని.. రూ. 80 వేల కోట్ల రూ-పాయలు ఖర్చు కావాల్సిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కేవలం 27 వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పనులు ఎలా పూర్తి అవుతాయి అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పి మోసాలు చేయాలని చూస్తే.. ఇంతవరకు జరిగిన ఎన్నికలలో ప్రజలు ఏ విధమైన తీర్పు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు గుర్తించుకోవాలన్నారు. ఈ ప్రాంత బిడ్డ.. సీఎం రేవంత్ రెడ్డి ఒక్కరోజు సెలవు తీసుకోకుండా రాష్ట్రం కోసం పనిచేస్తున్నారు.కేసీఆర్ ఏదో ఒక్క రోజు మాత్రమే పనులు చేశారు అని చెప్పారు. ఈ కారణాల వల్లనే ప్రజలు అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పారన్నారు. ఆయనను తిట్టడానికి ఆయన కూతురు కవిత చాలు.. మా అవసరం లేదని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద ఆరువేల కోట్లు, ఉచిత బస్సు కోసం పదివేల కోట్లు, రైతుల కోసం 20,000 కోట్లు, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు 20 వేల కోట్ల తో ఇంగ్ ఇండియా పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు మరెన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం చేపట్టింది అన్నారు. మరో 20 రోజులలో మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయి ఆ ఎన్నికలలో సీఎం, ఎమ్మెల్యేలు, ఎంపీలు లేని పార్టీలకు ఓట్లు వేయడం వల్ల ఒరిగేది ఏమీ ఉండదు. పనిచేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మునిసిపల్ ఎన్నికలలో గెలిపించడం



ద్వారా మరింత అభివృద్ధి సాధ్యం అవుతుందని కోటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. 40 శాతం సర్పంచ్ స్థానాలను గెలిచాము అని కేటీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నాడు. పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికలలో నిరంతరం అభివృద్ధి కోసం పరితపిస్తున్న మీ ఎమ్మెల్యే జిఎంఆర్ సారథ్యంలో మున్సిపల్ ఎన్నికలలో సత్తా చాటాలి అని కోటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజలకు, పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.


**ఇది అభివృద్ధి పండగ : మంత్రి వాకిటి శ్రీహరి**

కాంగ్రెస్ పాలన లో రాష్ట్రంలో అభివృద్ధి పండుగలు జరుగుతున్నాయని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీహరి అన్నారు. అత్యధిక వరి దిగుబడిని సాధిస్తూ దేశానికి సన్న బియ్యం అందిస్తున్న ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. మహిళలు, రైతులు సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గంలో 800 కోట్ల రూపాయల ఖర్చుతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది అన్నారు. మక్తల్ నియోజకవర్గంతో పాటు దేవరకద్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి శ్రీహరి చెప్పారు.

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు**

రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీహరి ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి భూత్పూర్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.భూత్పూర్ మున్సిపాలిటీలో 18 కోట్లు, దేవరకద్రలో 25 కోట్లు, కొత్తకోటలో 15 కోట్ల రూ-పాయల అంచనాలతో పట్టణాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

# అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలి



**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల అక్రమ అరెస్టుల విషయంలో డీజీపీతో ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడారు. పండుగ పూట కోర్టు సెలవులు ఉన్న సమయంలో, ఎయిర్‌పోర్టులో జర్నలిస్టును అరెస్ట్ చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు టెర్రరిస్టులా..? అర్ధరాత్రి జర్నలిస్టుల ఇండ్లకు వెళ్లి అరెస్ట్ చేయడం ఏంటి ప్రశ్నించారు. అరెస్టు చేసేందుకు న్యాయపరమైన నిబంధనలు పాటించాలని హరీష్ రావు అన్నారు.

**సజ్జనార్ కాంగ్రెస్ కండువా కప్పుకోవాలి.. హరీష్ రావు**

రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖూనీ చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ) తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లోని ఎన్టీవీ కార్యాలయంలో పోలీసుల సోదాలను ఈ సందర్భంగా ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్టీవీ భుజంపై తుపాకీ పెట్టి రాష్ట్రంలోని మీడియా మొత్తాన్ని రేవంత్ రెడ్డి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, జర్నలిస్టులను అర్ధరాత్రి అరెస్ట్ చేసి వికృతానందం పొందుతున్నారని మాజీ మంత్రి ధ-్వజమెత్తారు. అసలు అరెస్ట్ చేసిన జర్నలిస్టులేమైనా టెర్రరిస్టులా అని ఆయన ప్రశ్నించారు. ఈ రకమైన బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదని హరీష్ రావు హెచ్చరించారు.పోలీసుల తీరుపై కూడా హరీష్ రావు ఘాటుగా స్పందిస్తూ.. నగర సీపీ సజ్జనార్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. సజ్జనార్ పోలీస్ యూనిఫామ్ తీసేసి కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని, ఆయన తీరు అధికార పార్టీ కార్యకర్తలా ఉందని హరీష్ విమర్శించారు. గతంలో మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు చట్టం ఏమైందని ఆయన నిలదీశారు. ఆ రోజు కూడా బాధితురాలు మహిళేనని, కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే కేటీఆర్ కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మీడియాను తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూ-స్తున్నారని, ఇలాంటి దాడులకు బీఆర్ఎస్ భయపడబోదని హరీష్ రావు స్పష్టం చేశారు.అలాగే పోలీసులతో బెదిరించి ప్రశ్నించకుండా చేస్తున్నారని.. మీడియా ప్రశ్నించడం మానేస్తే అధికారంలో ఉన్నవాళ్లు బరితెగిస్తారని, ప్రజల గొంతుక లేకుండా పోతోందని, జర్నలిస్టులను చూస్తే చెంప పగలగొట్టాలని అనిపిస్తోందని ఓసారి సీఎం రేవంత్ అన్నారని, ప్రశ్నించే హక్కు ఇస్తున్నామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు

# ఎల్లారెడ్డిలో అభివృద్ధి పండగ



**తాడ్వాయి(ఎల్లారెడ్డి),ఫ్లాష్ ఇండియా :** ఎల్లారెడ్డి పు-రపాలక సంఘాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని నియోజకవర్గ ఎమ్మెల్యే కె. మదన్మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలో స-ుమారు రూ. 24 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు భారీ అభివృద్ధి పనులకు ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. మున్సిపల్ పరిధిలో ఎమ్మెల్యే పర్యటన ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధుల వివరాలను వెల్లడించారు. రూ. 4 కోట్లతో మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం,5వ వార్డులో రూ. 5 కోట్లతో అత్యాధునిక షాపింగ్ కాంప్లెక్స్, రూ. 3 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ (పెద్ద చెరువు) వద్ద మల్టీ జనరేషన్ పార్క్, రూ. 10 కోట్లతో సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కార్యాలయానికి కొత్త హంగులు, 11వ వార్డులో రూ. 2 కోట్లతో నూతన రోడ్ల నిర్మాణం. మున్సిపాలిటీలో విలీనమైన లింగారెడ్డిపేట గ్రామాభివృద్ధి పై ఎమ్మెల్యే ప్రత్యేక వరాలు ప్రకటించారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని, త్వ-రలోనే పనులు మొదలవుతాయని తెలిపి గ్రామ-స్తుల్లో హర్షం నింపారు. ఎస్సీ వాడలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. మున్నూరు కాపు, ముదిరాజ్ సంఘాల భవన మరమ్మత్తుల కోసం చెరో రూ. 5 లక్షల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మదన్మోహన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు.పదేళ్లు అధికారంలో ఉండి చేయలేని పనులను, మేము ఏడాదిలోనే చేసి చూపిస్తున్నాం. కొత్త బస్ స్టాండ్,సెంట్రల్ లైటింగ్, ఇందిరమ్మ ఇళ్లు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తున్న వాస్తవాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు అని పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిని రాష్ట్రంలోనే నెంబర్-1 నియోజకవర్గంగా మార్చడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# సంపాదకీయం

## ప్రెసిడెంట్ పర్మీషన్ మస్ట్..

జిల్లాల పునర్విభజనకు రాష్ట్రపతి ఆమోద ముద్ర తప్పనిసరి. లేకపోతే ఆ జిల్లాలు కేవలం రెవెన్యూ పరంగానే గుర్తింపు ఉంటుంది కాని, ఉద్యోగాల భర్తీకి,ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలకు అవకాశం ఉండదని సీనియర్ ఐఏఎస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే కేంద్రం సహోర్టు చేస్తే కొత్త జిల్లాలకు చకాచకా క్లియరెన్స్ లభిస్తుందని,లేకపోతే మాత్రం నెలల కొద్దీ పెండింగ్ లో పెట్టే చాన్స్ ఉందని అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రెండు సార్లు జిల్లాల విభజన ప్రక్రియ జరిగింది. మొదటిసారి 31 జిల్లాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించేందుకు ఏడాదిన్నర సమయం తీసుకున్నారని, ఆ తరువాత అదనంగా రెండు జిల్లాలను ఏర్పాటు చేస్తూ పంపిన ఫైల్ కేవలం నెల రోజులకే క్లియరెన్స్ లభించిందని గుర్తు చేస్తున్నారు.

**జోనల్ పరిధిలోపే కష్టం**

ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలను 7 జోన్లుగా, 2 మల్టీజోన్లుగా విభజిస్తూ రాష్ట్రపతి ఉత్త ర్వులు జారీ చేశారు. అయితే జిల్లాల పునర్విభజన ప్రక్రియ జోన్, మల్టీజోన్ పరిధిలోపే జరిగాలి. ఒకవేళ ఆ పరిధి దాటి కొత్తగా జిల్లాలు ఏర్పాటు చేస్తే, రాష్ట్రపతి ఉత్తర్వ్యాలను సవరించాలి. అందుకోసం ప్రభుత్వం కేంద్ర హెూం శాఖ ద్వారా రాష్ట్రపతి వద్దకు ఫైల్ పంపాలి. రాష్ట్రపతి వెంటనే ఆమోద ముద్ర వేస్తే సరి లేకపోతే నెలల కొద్దీ ఫైల్ పెండింగ్ లో పడుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. "ప్రస్తుతం ఉన్న జోనల్, మల్టీ జోనల్ పరిధి దాటి జిల్లాల పునర్విభజన జరిగితే రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడం కోసం కేంద్రానికి అప్పీలు చేయాలి. లేకపోతే న్యూ రిక్రూట్ మెంట్, ఉద్యోగుల బదిలీలు చేపట్టడం క ష్టం. ఈ ప్రక్రియ పూర్తవడానికి జిల్లాల పునర్విభజన తరువాత కనీసం 6 నెలల సమయం పడుతుంది. కేంద్రంతో సన్నిహిత సం బంధాలు ఉంటే ఫైల్ పంపిన నెల రోజుల్లో గ్రీన్ సిగ్నల్ లభించవచ్చు. 2016లో 31 జి ల్లాలతో జరిగిన పునర్విభజనకు రాష్ట్రపతి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు దాదాపు ఏడాదిన్న ర సమయం తీసుకున్నారు. ఆదే 2020 లో అదనంగా రెండు జిల్లాలు (ములుగు, నారాయణపేట) ఏర్పాటు చేస్తే, మళ్లీ ఫైల్ పంపితే నెల రోజుల్లో ఫైల్ క్లియర్ అయిందని బీఆ ర్ఎస్ హయాంలో జిల్లాల పునర్విభజనలో కీలక పాత్ర పోషించిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు.

**ఖాళీల భర్తీ ఎలా.. ఉద్యోగుల విభజన ఎలా?**

గత ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటించిన తరువాత ఇంతవరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమయంలో జిల్లాల పునర్విభజన అంశం ముందుకు రావడంతో ఎంప్లాయిస్ రిక్రూట్ మెంట్ ఉంటుందా? జిల్లాల పునర్విభజన వరకు పెండింగ్ లో పెడుతారా? అనే చర్చ జరుగుతున్నది. అయితే జిల్లాల పునర్విభజనకు కనీసం ఏడాది సమయం పట్టే చాన్స్ ఉంటుందని, ఈలోపు ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవనే వాదనలు సైతం ప్రభుత్వ వర్గాల్లో ఉన్నాయి. అయితే బీఆర్ఎస్ హయంలో జరిగిన జిల్లాల విభజన వల్ల జిల్లా ఉద్యోగులు తీవ్రంగా నష్టపొయ్యారు. వారంత అందోళన చేయడం వల్ల 317జీవో బాధితులను ఆదుకునేందుకు కాంగ్రెస్ సర్కారు కేబినెట్ సబ్ కమిటీ వేసి, ప్రత్యేకంగా పోస్టింగ్ ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ జిల్లాల పునర్విభజన చేస్తే ఉద్యోగుల విభజన మళ్లీ చేయాల్సి ఉంటుంది. దీనితో మళ్లీ తమ స్థానికత ఉన్న జిల్లాకు వెళ్లగలమా?మరో జిల్లాకు పంపిస్తారా?అనే చర్చ ఎంప్లాయిస్ లో నెలకొన్నది.

**ఓ వైపు జనాభా లెక్కలు, మరోవైపు డీ లిమిటేషన్ అంశం**

జనాభా లెక్కలు పూర్తయ్యే ఈ ఏడాది చివరి వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు మార్చొద్దని కేంద్రం ఆదేశించింది. మరి ఇలాంటి సమయంలో జిల్లాల పునర్విభజన ప్రక్రియ చేపట్టడం కష్టమని అధికారులు స్పష్టం చేశారు. అయితే ఈలోపు ప్రజల అభిప్రాయాలు తీసుకుని, జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లాల పునర్విభజన చేపట్టొచ్చని అభిప్రాయపడ్డారు. కాని అసెంబ్లీ, లోకసభ నియోజకవర్గాల పునర్విభజన సైతం ఒక అడ్డంకిగా మారే అవకాశం ఉందని అంటున్నారు. లోకసభ, అసెంబ్లీ స్థానాలు ప్రకటించిన తరువాత జిల్లాల పునర్విభజన చేపట్టడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్తున్నారు. లేకపోతే మాత్రం మళ్లీ ఒక్కో అసెంబ్లీ స్థానం రెండు మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లే ప్రమాదంఉంటుందని కామెంట్ చేస్తున్నారు.

## జాతుల సార్వభౌమత్వంపై సామ్రాజ్యవాద పంజా

యూరోపియన్ దేశాలు ఉభయ అమెరికా ఖండాలలోని స్వతంత్ర దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదని, ఉభయ అమెరికాల్లో కొత్త వలసలకు పూనుకోకూడదని, ఇందుకు ప్రతిగా యూరోపియన్ వలసలలో గానీ, యూరోపియన్ రాజ్యాల అంతర్గత వ్యవహారాలలో గానీ తాము జోక్యం చేసుకోబోమని అమెరికా అయిదవ అధ్యక్షుడు జేమ్స్ మన్రో 1823లో ప్రతిపాదించారు. రెండు శతాబ్దాల అనంతరం అమెరికా 47వ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జనవరి 2 అర్ధరాత్రి ఆ సుప్రసిద్ధ మన్రో సిద్ధాంతంలోని ప్రతి మౌలిక అంశాన్ని ఉల్లంఘించారు. దక్షిణ అమెరికా ఖండంలోని ఒక సార్వభౌమిక రాజ్యాన్ని దురాక్రమించేందుకు అమెరికా అపార సైనిక శక్తిని ఆయన ఉపయోగించారు. దురాక్రమించిన దేశ అధ్యక్షుడిని బంధించి, న్యూయార్క్‌కు తీసుకువచ్చి నేర విచారణా న్యాయస్థానంలో నిలబెట్టారు. ట్రంప్ తెగువకు ప్రపంచదేశాలు నివ్వెరబోయాయి.ట్రంప్ అమలుపరిచిన కొత్త మన్రో సిద్ధాంతం బుష్--ట్రంప్ సిద్ధాంతంగా పిలిచేందుకు అర్హమైనది. వెనెజువెలా ఉదంతానికి సమాంతర ఘటనగా 1989లో పనామాలో అమెరికా జోక్యాన్ని చెప్పవచ్చు. అమెరికా నాటి అధ్యక్షుడు సీనియర్ జార్జి బుష్ ఆదేశాల మేరకు అమెరికా సైన్యం పనామాపై దండయాత్ర చేసి, పనామా సైన్యాలను ఓడించింది. పనామా అధ్యక్షుడు నోరియేగా తమ రాజధానిలోని వాటికన్ రాయబార కార్యాలయాన్ని శరణుజొచ్చారు. అయితే అంతిమంగా అమెరికా సైన్యానికి లొంగిపోక తప్పలేదు. అమెరికా దురాక్రమణ లక్ష్యం పనామాలో తమకు సానుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని నెలకొల్పడమే. ఆ లక్ష్యం నెరవేరింది.ట్రంప్ ప్రకటనలను నిశితంగా పరిశీలిస్తే వెనెజువెలాలోని అపార చమురు సంపదపై నియంత్రణ సాధించే లక్ష్య పరిపూర్తికి మదురో బాధితుడు అయ్యాడన్నది స్పష్టమవుతున్నది. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంతగా చమురు నిల్వలు వెనెజువెలాలో ఉన్నాయి. తన చమురును ప్రధానంగా చైనాకు ఎగుమతి చేస్తూ ఆ దేశం నుంచి ఆయుధాలు, విదేశీ పెట్టుబడులను వెనెజువెలా దిగుమతి చేసుకొంటున్నది. మరే ఇతర దేశమూ, మరీ ముఖ్యంగా రష్యా, చైనాలు వెనెజువెలా చమురు సంపదను స్వాయత్తం చేసుకోకుండా అడ్డుకునేందుకు అమెరికా కృతనిశ్చయంతో ఉన్నది. ఆ చమురు నిక్షేపాలు పూర్తిగా తన నియంత్రణలో ఉండాలని అమెరికా పట్టుదలతో ఉంది. మదురోను పట్టుకున్న అనంతరం ట్రంప్ విలేఖర్లతో మాట్లాడుతూ, వెనెజువెలాలో చమురును ఉత్పత్తి చేసి, విక్రయించేందుకు అమెరికా కార్పొరేట్ కంపెనీలకు అనుమతినిచ్చినట్టు వెల్లడించారు.నికోలస్ మదురోను పట్టుకునేందుకు ఉద్దేశించిన నాలుగు గంటల 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్' అమెరికా సైనిక దళాల అపూర్వ శక్తి సామర్థ్యాలకు నిలువెత్తు నిదర్శనం. అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో పటిష్ఠ ప్రణాళికతో అంతే దక్షతతో దానిని అమలుపరచడం ప్రపంచాన్ని అబ్బురపరిచింది. అర్ధరాత్రిపూట మరొక దేశంలోకి ప్రవేశించి, దేశాధ్యక్షుడిని బంధించి తీసుకురావడమనేది అమెరికా సేనలకు మాత్రమే సాధ్యమయ్యే పని. ప్రపంచ చరిత్రలో ఎప్పుడూ ఏ దేశానికీ లేని మహాశక్తిమంతమైన యుద్ధ యంత్రాంగం అమెరికాకే సొంతం. ఈ సైనికశక్తిని ఉపయోగించుకుని చైనా మినహా, మిగతా ప్రపంచమంతటిపై పెత్తనం చెలాయించడానికి అమెరికా ఆరాటపడడం ఆందోళన కలిగిస్తున్న విషయమే.'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్'కు పూర్వమూ, పిమ్మట భారత్ అనుసరించిన వైఖరి ఏమిటనేది ఎవరికీ పట్టలేదు! ట్రంప్ ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ విషయంలోనూ, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తున్న విషయంలోనూ ప్రధాని మోదీని చిన్నబుచ్చే విధంగా పలుమార్లు మాట్లాడారు. ట్రంప్ వైఖరికి భయపడుతున్న కారణంగానే, వెనెజువెలా విషయమై మోదీ సర్కార్ విడుదల చేసిన ప్రకటనలో మదురో అరెస్ట్‌ను ఖండించనే లేదు. అసలు ఆ వ్యవహారంలో అమెరికా ప్రమేయాన్ని గురించి కూడా ప్రస్తావించనే లేదు. 'వెనెజువెలాలో 'ఇటీవలి పరిణామాల గురించి' ప్రస్తావిస్తూ 'అన్ని సమస్యలనూ సంబంధిత వ్యక్తులు చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని' ఆ ప్రకటన సూచించింది. ఫుట్‌బాల్ మ్యాచ్‌లో స్కోర్ విషయమై నెలకొన్న వివాదంపై పెద్దమనిషి తరహా సలహా ఇస్తున్నట్టుగా ఆ ప్రకటన ఉన్నది! చెప్పవచ్చినదేమిటంటే, విశ్వగురు అనే ఘనతలకు పోతున్న భారత్ ప్రపంచ వ్యవహారాలలో తన ప్రాధాన్యాన్ని కోల్పోయింది. 'ఇండియా ఏమి చెప్పినా అది ఎటువంటి ప్రభావాన్నీ చూపదు' అని భారత మాజీ రాయబారి ఒకరు నిష్కర్షగా వ్యాఖ్యానించడం గమనార్హం.ట్రంప్ అమెరికా వలే, పుతిన్ రష్యా, కమ్యూనిస్టు చైనా సైతం ఇతర దేశాలను దురాక్రమించేందుకు సాహసించవచ్చు. అందుకు ఆ రెండు అగ్రరాజ్యాలను 'అబ్సల్యూట్ రిజాల్వ్' ప్రోద్బలిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. డెన్మార్క్‌లో భాగమైన గ్రీన్‌లాండ్‌ను స్వాయత్తం చేసుకుంటామని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు సూచనప్రాయంగా చెప్పారు. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఒక కొలిక్కి రావడం అంటూ జరిగితే ఉక్రెయిన్ తప్పనిసరిగా తన భూభాగాలను రష్యాకు వదులుకోవల్సి ఉంటుంది. చైనా తన 'ఒకే చైనా' విధానాన్ని దాని తార్కిక పర్యవసానానికి తీసుకువెళ్లే అవకాశం ఎంతైనా ఉన్నది.చైనా కనుక మరోసారి మన ఉత్తర సరిహద్దుల్లోకి లేదా అరుణాచల్‌ప్రదేశ్‌లోకి చొరబడిన పక్షంలో మనలను ఆదుకునేందుకు ఏ దేశమూ ముందుకురాదు. భారత్ తనను తానే రక్షించుకోవల్సి ఉంటుంది. వెనెజువెలా చమురు నిక్షేపాలపై నియంత్రణ సాధించిన అమెరికా, ఇప్పుడు భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపదు. వాణిజ్య ఒప్పందం లేకుండానే సుంకాలను పెంచుతూ, తగ్గిస్తూ అమెరికాకు భారత్ ఎగుమతులను ట్రంప్ ఏదో ఒక రీతిలో అనుమతిస్తాడు. ఏడాది క్రితం రెండవసారి అధికారంలోకి వచ్చిన డోనాల్డ్ ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారీ అధ్యక్షుడు. ఆయన జోక్యం చేసుకున్న దేశాల జాబితాలో గతంలో పాలస్తీనా, ఇరాన్, సిరియా, యెమెన్, నైజీరియా, తాజాగా వెనెజువెలా ఉన్నాయి. మదురో, ఆయన భార్య విపత్కర పరిస్థితికి మనం ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చకపోవచ్చు కానీ, సామ్రాజ్యవాదం పునర్విజృంభణ, జాతుల సార్వభౌమత్వం సమసిపోయే సంకటం ప్రపంచానికి వాటిల్లినందుకు మనం దుఃఖించాలి.

# రోడ్డు భద్రతలోనే మన భవిత

ప్రమోదం కోసమో, ఏదో ప్రయోజనం కోసమో జరిగే ప్రయాణాల్లో ప్రమాదాలు క్రమంగా పెరుగుతున్నాయి. వ్యక్తులకూ, కుటుంబాలకూ, సమాజానికీ దుఃఖదాయకమవుతున్నాయి. 2023 సంవత్సరపు లెక్కలు తీసుకుంటే దేశవ్యాప్తంగా జరిగిన 4.81 లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1.73 లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు, 4 లక్షల 63 వేల మంది వికలాంగులయ్యారు. ఈ లెక్కన దేశం మొత్తమ్మీద ప్రతి గంటకూ 55 ప్రమాదాలు, 20 మరణాలు సంభవిస్తున్నాయి. ఈ లెక్కలను భారత ప్రభుత్వ 'రోడ్డు రవాణా హైవే మంత్రిత్వ శాఖ' విడుదల చేసింది.తెలంగాణ విషయానికొస్తే-- 2014 సంవత్సరంలో 20,078 రోడ్డు ప్రమాదాల్లో 6,906 మంది మరణించగా, 21,636 మంది వికలాంగులయ్యారు. 2023లో 22,903 ప్రమాదాల్లో 7,660 మంది మరణించగా, 21,022 మంది వికలాంగులయ్యారు. 2024లో 25,934 ప్రమాదాల్లో 7,281 మంది మరణించగా 15,401 మంది వికలాంగులయ్యారు. ఈ అంకెలు చెబుతున్న సత్యం ఒక్కటే-- రోడ్డు భద్రత అత్యావశ్యకం అని!రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న అంశాల్లో ముఖ్యమైనది అతివేగం. త్వరగా గమ్యం చేరుకోవాలన్న తొందర, యువతలో ఉండే అత్యుత్సాహం, రోడ్డు నియమాలను పాటించకపోవడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్య వైఖరి వంటి కారణాల వల్ల తాము మాత్రమే గాక, ఎదుటి వాహనదారులకు కూడా ఇబ్బందులు కలిగిస్తూ వెళు తున్నారు. హెల్మెట్ ధరించడంపై ప్రభుత్వం ఎన్నో నిబంధనలు విధించినప్పటికీ వాహనదారులు వాటిని సరిగ్గా పాటించకపోవడం వల్ల 2023లో దేశవ్యాప్తంగా దాదాపు 54 వేల మంది మరణించారు. అలాగే నాలుగు చక్రాల వాహనాల విషయంలో సీటు బెల్టు నియమాన్ని సరిగ్గా పాటించకపోవడం వల్ల దేశవ్యాప్తంగా 16,251 మంది మరణించారు. దీనికితోడు రోడ్డు గుంతలు, రోడ్డు డిజైన్ లోపాలు, క్రాస్‌ఓవర్ దగ్గర సరైన సూచికలు లేకపోవడం, ఒకవేళ ఉన్నా వాటిని వాహనదారులు ఆ వేగంలో గమనించలేక పోవడం వంటి కారణాల వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నట్టు భారత ప్రభుత్వం ప్రస్తావించింది.అలాగే రోడ్డు ప్రమాదాలపై సర్వేలలో 18 నుంచి 45 ఏళ్ల వయసువారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నట్లుగా తేలింది. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 66.4 శాతం ఈ వయో సమూహానికి సంబంధించినవారే. దేశ ఉత్పాదకతకు ఎంతో విలువైన మానవ వనరుగా ఉండే ఈ వయో సమూహం మితిమీరిన ఆత్మవిశ్వాసంతో అతివేగంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నది.మరోపక్క మన దేశంలో వాహనాల సంఖ్య ఏ ఏటికాయేడు విపరీతంగా పెరుగుతున్నది. వ్యాపార వాణిజ్య వ్యవహారాల విస్తరణ వంటి కారణాల వల్ల వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్లు పెరిగాయి. నిజానికి ఇది ఒక అభివృద్ధి సూచిక. వాహనాల సంఖ్య పెరుగుతున్నది అంటే ఆ మేరకు వాహనాలను కొనుగోలు చేసే సామర్థ్యం ప్రజలలో పెరిగినట్టు, ఆ మేరకు పర్యటన, ప్రయాణం విస్తరించినట్టు. ఇది జాతీయ అభివృద్ధి సూచికలో ప్రధానాంశం. 2023లో మనదేశంలో మొత్తం 26 కోట్ల టూ వీలర్స్, 5 కోట్ల పైన ఫోర్ వీలర్స్ ఉన్నట్టుగా తెలుస్తోంది. వీటిలో తెలంగాణలో 2024లో 1 కోటి 63 లక్షల వాహనాలు రిజిస్టర్ కాగా, వాటి సంఖ్య 2025 నాటికి 1 కోటి 73 లక్షలకు పెరిగింది. వీటిలో 1 కోటి 24 లక్షల టూవీలర్స్ ఉండగా, 50 లక్షల ఫోర్ వీలర్స్ ఉన్నాయి. ట్రాక్టర్లు, ట్రాలీల సంఖ్య 7.5 లక్షలు ఉంది. ఇలా సగటున ప్రతి రోజూ 3 వేల పైన వాహనాలు తెలంగాణలో రిజిస్టర్ అవుతున్నట్టుగా గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ సంఖ్య తెలంగాణ రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకుపోతున్న తీరుకు ఒక సూచికగా భావించవచ్చు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్దిష్టమైన వ్యూహంతో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రోడ్డు రవాణా శాఖ సిబ్బందిని సక్రమంగా వాడడం ద్వారా ఈ ప్రమాదాలను, వాటిలో మరణాలను తగ్గించడంలో గణనీయమైన ప్రగతి సాధించింది.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజా ప్రభుత్వం ఇప్పటికే ఏడు అంచెల వ్యూహాన్ని అమలు చేస్తోంది. 1) యువతలో, విద్యార్థి లోకంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. 2)వివిధ కళాశాలల్లో, పాఠశాలల్లో రోడ్డు భద్రతను సిలబస్‌లో భాగంగా చేయడం. 3) జిల్లాలవారీగా ప్రత్యేక క్యాంపెయిన్‌లను నిర్వహించడం. 4) రోడ్లు భవనాల శాఖ, మునిసిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, అబ్కారీ, పోలీస్, ట్రాఫిక్ ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ రోడ్ల నాణ్యతను మెరుగు పరచడం, రోడ్లపై ప్రయాణాన్ని క్రమబద్ధీకరణ చేయడం. 5) పత్రికలు, టీవీ, సోషల్ మీడియాలలో ప్రచారం. 6) రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సదుపాయం, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలవడం. 7) డ్రంక్ అండ్ డ్రైవ్ నిరోధించడం. వీటికి తోడుగా వాహనదారులు, ప్రయివేట్ వాహన యాజమాన్యాలు, ప్రజలు, పౌరుల సహకారం ఎంతో అవసరం. ముఖ్యంగా వాహనదారులు ప్రభుత్వ నియమాలను తు.చ. తప్పకుండా పాటించాలి. రోడ్డు ప్రమాదాల వల్ల వ్యక్తుల వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ కార్యక్రమాలకు విఘాతమే కాదు, అన్నిటినీ మించి వారినే నమ్ముకున్న కుటుంబాలకు పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. 'రోడ్డు భద్రత అంటే మన భద్రత, మన కుటుంబ భద్రత, మన సమాజ భద్రత' అనే అంశాన్ని మనం విస్మరించరాదు. ఈ దిశగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలతోపాటు నిపుణులైన సుశిక్షితులైన బాధ్యతతో కూడిన డ్రైవర్లను, బాధ్యతాయుతమైన యంత్రాంగం నిర్వహించే ఆర్టీసీ బస్సులను, ఆర్టీసీ కార్గో సర్వీసులను విస్తృతంగా అందజేస్తోంది.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటిరోజే తన హామీని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'మహాలక్ష్మి పథకం' ద్వారా తెలంగాణలోని మహిళలు అందరికీ ఉపయోగపడే విధంగా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పించారు. ఈ విధానం వల్ల బాధ్యతాయుతమైన ప్రయాణాల సంఖ్య పెరిగి, ప్రమాదాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది. ఎక్కడైతే సరైన యంత్రాంగం, సుశిక్షితులైన డ్రైవర్లు, ఎప్పటికప్పుడు పరీక్ష చేసి సంసిద్ధంగా ఉన్న వాహనాలు అందుబాటులో ఉంటాయో అప్పుడు సహజంగానే ప్రమాదాల సంఖ్య తగ్గుతుంది.అందుకని తెలంగాణ ఆడబిడ్డలు, ప్రజలందరి సుఖ ప్రయాణం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అవగాహన చైతన్య కార్యక్రమాలను ఆహ్వానించి రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించి తమకు, కుటుంబానికి, సమాజానికి, తెలంగాణ రాష్ట్రానికి మేలు చేయాలని అభ్యర్థిస్తున్నాను.

## సాగునీటి కష్టాలకు చెక్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన చనాక-కొరాట ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొచ్చేలా ముందుకు సాగుతున్నది. ఈ ప్రాజెక్టు తెలంగాణ, మహారాష్ట్రల సంయుక్త ప్రాజెక్టు కాగా.. ఇరు రాష్ట్రాల భాగస్వామ్యంతో నిర్మితమైంది. ఇది పెన్‌గంగా నదిపై 6,677 హెక్టార్ల విస్తీర్ణానికి నిర్మింతమైంది. తెలంగాణలో 5,463 హెక్టార్లు, మహారాష్ట్రలో 1,214 హెక్టార్లకు సాగునీరు అందించడానికి ప్రతిపాదించారు. కమాండ్ ఏరియా మూడు మండలాల్లోని 14 గ్రామాలలో ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్, మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లాలోని కేలాపూర్ తహసీల్‌లోని తొమ్మిది గ్రామాలకు సాగునీరు అందించనున్నారు.

**2016లో ఒప్పందం..**

ఆగస్టు 23, 2016న ముంబైలో జరిగిన అంతర్రాష్ట్ర బోర్డు సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలు చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణం కోసం ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ ప్రాజెక్టు కారణంగా 23 గ్రామాల్లోని 283 మంది ప్రజలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.399.16 కోట్లు కాగా..

ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు సైతం లభించాయి. 2016లో జరిగిన ఒప్పందం ప్రకారం తెలంగాణ, మహారాష్ట్ర సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. తెలంగాణలోని 5,463 హెక్టార్లకు, మహారాష్ట్రలోని 1,214 హెక్టార్లకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందనుంది. ఇందుకోసం పెన్ గంగ నదిపై లోయర్ పెన్ గంగ దిగువన 23 గేట్లతో 0.8 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజీ నిర్మించనున్నారు. చనాక-కొరటా బ్యారేజీ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 13వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆనకట్ట నుంచి లోయర్ పెన్ గంగ కాల్వల ద్వారా మరో 47వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. మొత్తంగా ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందనుంది.

**23 గేట్లతో బ్యారేజీ నిర్మాణం..**

ఇప్పటికే 23 గేట్లతో చనాక-కొరాట బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. ప్రాజెక్టులో భాగంగా 35మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఆరు మోటార్ల ద్వారా 13,500 ఎకరాలకు సాగునీరు, గ్రావిటీ కెనాల్ ద్వారా 47,500 ఎకరాలకు నీరు అందించాలని నిర్ణయించారు. ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాలకు తాగు, సాగునీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. వాస్తవానికి 1975లో చనాక కొరాటా ప్రాజెక్టు నిర్మాణం కోసం మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మధ్య ఒప్పందం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని ప్రక్రియలు పూర్తిచేసుకున్నా.. పనులు ఆలస్యమయ్యాయి.

ఆరు మోటార్లకుగాను ఒక మోటార్ డ్రైరన్ ఇప్పటికే పూర్తి కాగా.. వెట్‌రన్‌ను సైతం పూర్తిచేశారు. అయితే.. ఈ ప్రాజెక్టు పనులు పదేండ్లుగా కొసాగుతూనే ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో ఇప్పటికీ చుక్క నీరందడం లేదు. నిధులు కేటాయించడంతోపాటు వెంటనే రిలీజ్ చేస్తేనే కాలువలు, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

**పెండింగ్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రాధాన్యం..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇందులో చనాక-కొరాటను సైతం తీసుకుంది. గత బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.179 కోట్లు సైతం కేటాయించింది. గత బీఆర్ఎస్ హయాంలో పంప్‌హౌజ్, రిజర్వాయర్, డిస్ట్రిబ్యూటర్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. ముందుగా రూ.386 కోట్ల అంచనాతో చేపట్టగా, ఫండ్స్ సరిపోవడం లేదంటూ రూ.1,227 కోట్లకు పెంచారు. అయినా..

ప్రాజెక్టు పూర్తి కాలేదు. రూ.2 వేల కోట్లకు అంచనాలు పెంచినప్పటికీ, నిధులు విడుదల చేయకపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. 2018లోనే ఈ ప్రాజెక్టు పూర్తిచేయాల్సి ఉండగా నిధుల కొరతతో పదేళ్లుగా గడువు పెంచుతూ వస్తున్నారు.

**ఈ నెల 16న సీఎం పర్యటన..**

ఈ ప్రాజెక్టును కీలకంగా తీసుకున్న ప్రభుత్వం పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్నారు. భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలో పంప్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. కాగా..

ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో నేపథ్యంలో మంగళవారం భోరాజ్ మండలం హాతీఘాట్ గ్రామంలో చనాక-కొరాట పంప్ హౌస్ వద్ద ప్రారంభోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు పరిశీలించారు. అలాగే.. సీఎం అదే రోజు నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలో సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించనుండగా దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు.

**2027 డిసెంబర్ నాటికి పూర్తి..**

చనాక-కొరాట బ్యారేజికి భూసేకరణ పెండింగులో ఉన్నందున షెడ్యూల్ ప్రకారం పని పూర్తి కాలేదు. ఇప్పటివరకు భూసేకరణ ఇతర వ్యయాలతోపాటు ఈ ప్రాజెక్టుపై చేసిన వ్యయం రూ.1244.66 కోట్లు. ఇంకా కావలసిన నిధులు రూ. 792.91 కోట్లు. 2027, డిసెంబరు నాటికి పూర్తి చేసేలా కేటగిరి-బి క్రింద ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ఆ ప్రకారంగా, 2025-26 ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ, ఇతర పనుల కోసం రూ.147.00 కోట్ల నిధులను కేటాయించడమైంది. రూ.71.96 కోట్ల భూసేకరణ బిల్లులను జిల్లా కలెక్టరు, ఆదిలాబాద్ విడి ఖాతాకు జమ చేయడమయింది. ఈ ప్రాజెక్టు డిసెంబరు, 2027 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగింది.

## బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ అనేక ప్రణాళికలు






చట్టబద్ధంగా బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేందుకు స్పేస్ లేకుండా పోయింది. అధికార పార్టీ వచ్చే ఎన్నికల్లో ఎలాంటి వ్యూహాన్ని అనుసరించబోతోందా? పార్టీ తరపున బీసీలకు రిజర్వేషన్ ని ఇస్తారా..? మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే వ్యూహమా? బీసీలకు జనాభా ప్రకారం అన్నిట్లో వాటా ఇస్తామని ప్రకటిస్తూ వచ్చింది కాంగ్రెస్. అందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా చట్టబద్ధంగా ఇచ్చేందుకు ప్రయత్నించింది. అయితే ప్రభుత్వ ప్రయత్నాలన్నీ కోర్టులో పరిగణలోకి రాకుండా పోయాయి. ప్రస్తుతం ఈ ఎపిసోడ్ కోర్టులో ఉండడంతో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా ఇస్తారు అనేది చర్చనీయాంశంగా మారింది. పార్టీ పరంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని భావిస్తుంది. దాంట్లో భాగంగానే బీసీ అభ్యర్థుల ఎంపిక చేయాలని పార్టీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.సహజంగా రూరల్ లో జనాభా ప్రతిపాదన చూస్తే ఒకరకంగా మున్సిపాలిటీలలో జనాభా చూస్తే మరోరకంగా ఉంటుంది. దీంట్లో బీసీలకు సాధారణంగా ఇచ్చే రిజర్వేషన్ల కంటే ఎక్కువ సీట్లు దకే అవకాశం కూడా ఉంటుందనేది అధికార పార్టీ అంచనా. మున్సిపాలిటీలలో సాధారణంగా ఇచ్చే రిజర్వేషన్ల కంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన టికెట్లు ఇవ్వాలని ఆలోచిస్తోంది. మున్సిపాలిటీలలో కూడా చైర్మన్ పదవులు బీసీలకు ఇవ్వాలని లెక్కలు వేసినట్టు తెలుస్తోంది. ప్రభుత్వపరంగా సర్వేలు చేయడరౌ జీవోలు తేవడం లాంటి అంశాలు అనుకూలమైనాౌఅది చట్టబద్ధంగా కల్పించడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో పార్టీ పరంగానే మున్సిపాలిటీల్లోని వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ లలో కూడా 42శాతం బీసీలకు కేటాయించాలన్న ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీసీ నినాదం కొంత వర్కౌట్ అయిందని పార్టీ లెక్కలు వేసుకుంటోంది. ఎవరి లెక్కలు ఎలా ఉన్నా కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాన్ని అమలు పరచాలని చూస్తోంది. బీసీలకు పార్టీ చెప్పినట్టుగా 42శాతం సీట్లను కేటాయించాలని డిసైడ్ అయినట్టు కనపడుతోంది. అందుకు అనుగుణంగా జిల్లా అధ్యక్షులకు, ఎమ్మెల్యేలకు కూడా అభ్యర్థుల ఎంపిక జరగాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# 'స్టాంప్ డ్యూటీ స్కాం' లో కొత్త కోణం..!

## ఆన్ లైన్ ఫ్రీ వెర్షన్లతో పీడీఎఫ్ చలానా మార్ఫింగ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** టెక్నాలజీ యుగంలో ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయడం ఇప్పుడు సర్వసాధారణమైపోయింది. సినీ ప్రముఖులు, చిరంజీవి, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ వంటి వారే తమ ఫొటోల దుర్వినియోగంపై కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే సాంకేతికతను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ ఖజానాకే కన్నం వేయొచ్చని నిరూపిస్తున్నారు కొందరు కేటుగాళ్లు. ఆన్ లైన్ ఫ్రీ వెర్షన్ల ద్వారా పీడీఎఫ్ ఫైళ్లను ట్యాంపరింగ్ చేస్తూ.. చలానాను మార్ఫింగ్ చేస్తూ స్టాంప్ డ్యూటీ స్కాంకు తెరతీశారు. ఆన్ లైన్ ఎడిట్ ఆప్షన్ల ద్వారా రూ.500 చలానాను రూ.5 లక్షలుగా మార్చేసి.. భూ భారతి, ధరణి పోర్టళ్లనే ఏమార్చి.. భూ క్రయ విక్రయాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. కొనుగోలు దారుల నుంచి పూర్తి డబ్బులు వసూలు చేసి, తక్కువ మొత్తానికి చలానా కట్టి దోపిడీకి పాల్పడ్డారు. అయితే కొన్ని సేల్ డీడ్స్ కొనుగోలుదార్లకు తెలిసే జరిగి ఉండొచ్చు. కొందరు ఆపరేటర్లు కక్కుర్తిపడి ఈ పనిచేసి ఉండొచ్చు. దీనిపై రెవెన్యూ శాఖ దర్యాప్తు కొనసాగిస్తున్నది. పోలీసు శాఖ కూడా లెక్కలు తేల్చే పనిలో పడింది. తెర వెనుక టెక్నాలజీ హెడ్స్ లేకుండానే పని జరిగిందా.. లేదా? అన్నది ప్రభుత్వ విచారణలోనే బయటపడాలి. కాగా, మరోసారి అక్రమార్కులకు అవకాశం లేకుండా మెరుగైన, పకడ్బందీ వెబ్ పోర్టల్ ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. భూ భారతి 2.0లో అక్రమార్కులకు అవకాశం లేని టెక్నాలజీని వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**హన్మకొండలోనూ అక్రమార్కులు**

హన్మకొండ జిల్లా నడికుడ మండలానికి చెందిన ఓ కుటుంబం తమ తండ్రి పేరిట ఉన్న భూమిని వారసుల పేరిట సక్సెషన్ చేసుకోవడానికి నిర్ణయించుకున్నది. పరిచయమున్న మీ సేవా కేంద్రం నిర్వాహకుడు నాగేంద్రప్రసాద్ ని సంప్రదించారు. అతను వివరాలన్నీ తీసుకొని రూ.50 వేల వరకు అవుతుందంటే డబ్బులు ఇచ్చారు. ఈ మేరకు అమౌంట్ కట్టినట్లుగా చూపించాడు. అయితే నెలలు గడుస్తున్నా పని కాలేదు. నిజానికి అతను వారసులకు ఇచ్చిన చలానా ఉత్తుత్తిదే. చలానా నం.6170295738029 ద్వారా రూ.41,880 చెల్లించినట్లుగా పీడీఎఫ్ ఫైల్ ఉంది. 2023 డిసెంబరు 19న రూపొందింది. మర్చంట్ పేరు దగ్గర ధరణి ప్రాజెక్టు కమిషనర్ అండ్ ఐజీఆర్ఎస్ తెలంగాణ అని పేర్కొన్నారు. ఇది అచ్చు గుద్దినట్లుగా ఎస్బీఐ చలానా మాదిరిగానే ఉంది. నిజానికి ఇది ప్రభుత్వ ఖాతాలో జమ కాలేదు. అంటే ఇది పక్కా ఫేక్ అని తెలుస్తుంది. నిజానికి అతను సక్సెషన్ కి అప్లయ్ కూడా చేయలేదు. విషయం తెలుసుకున్న బాధితులు మరోసారి వేరే చోట చలానా కట్టి అప్లయ్ చేయగా.. ఎలాగోలా పని పూర్తయింది. ప్రస్తుతం ఇలాంటి ఫేక్ చలానాలు పట్టుకొని చాలా మంది హన్మకొండ జిల్లాలో తిరుగుతున్నారని తెలిసింది. డబ్బులు దండుకొని కనీసం అప్లయ్ చేయకుండా కాలయాపన చేస్తున్న అక్రమార్కులు ఉన్నారు.

**ఎండార్స్‌మెంట్ చూస్తే చాలు..**

ప్రతి సేల్‌డీడ్‌లో జాయింట్ రిజిస్ట్రార్లు ఎండార్స్‌మెంట్ డిటెయిల్స్, చలానా పరిశీలిస్తే వాస్తవాలు తెలిసిపోతాయని మీసేవా నిర్వాహకులు అంటున్నారు. చలానాలో ఎంత అమౌంట్ ఉంటుందో, అంతే అమౌంట్ ఎండార్స్‌మెంట్‌లో ఉండాలి. ఈ ఎండార్స్‌మెంట్ భూ భారతి (అంతకు ముందు ధరణి) పోర్టల్ క్రియేట్ చేస్తుంది. దీనిపై సంతకం చేసే ముందు జాయింట్ రిజిస్ట్రార్ దీన్ని స్టడీ చేస్తే ఏమైనా తేడా ఉంటే తెలిసిపోతుంది. ప్రతి జాయింట్ రిజిస్ట్రార్ ఈ పేజీపై సంతకం చేశాక ఈ ఫైల్‌ను అప్‌లోడ్ చేస్తారు. అయితే, ఫేక్ చలానాలు అప్ లోడ్ చేసే వారు డౌన్ లోడ్ చేసి, కొనుగోలుదారుడికి అందించేటప్పుడు మాత్రమే పీడీఎఫ్ ఎడిట్ చేసి మార్ఫింగ్ చేసే అవకాశాలు ఉంటాయి. ఈ పని భూభారతి ఆపరేటర్లు తలచుకుంటేనే జరుగుతుందనే చర్చ ఉన్నది.

**నాడే ఆడిట్‌కు అనుమతిస్తే..**

ధరణి పోర్టల్ అమల్లోకి రాకముందే రాష్ట్ర వ్యాప్తంగా 19 తహశీల్దార్ కార్యాలయాలను రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడిపించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అప్పట్లో ఆ కార్యాలయాల్లో అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ లావాదేవీలు జరిపేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. పైలెట్ ప్రాజెక్టు చేపట్టినప్పుడే జిల్లా రిజిస్ట్రార్లు ఆడిట్ చేసేందుకు ఆ కార్యాలయాలకు వెళ్లారు. అయితే తామంతా రెవెన్యూ శాఖకు కింద పని చేస్తున్నామని, తమ కార్యాలయాల్లోకి రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పెత్తనం ఏమిటని, ఆడిట్ చేయకుండా తిప్పి పంపినట్లు సబ్ రిజిస్ట్రార్ల సంఘం నాయకుడొకరు 'దిశ' తెలిపారు. నిజానికి ఆ రోజుల్లోనే ఆడిట్‌కు అవకాశం చేయనిచ్చి ఉంటే.. ఆ ప్రక్రియ ఏయేటికాయేడు పూర్తయ్యేది. ఎక్కడైతే లోపాలు తలెత్తాయో వాటిని నాలుగేండ్ల క్రితమే గుర్తించే చాన్స్ లభించేది. అప్పట్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మాత్రం రెవెన్యూ శాఖకు కట్టబెట్టారు. కానీ ఆడిట్ బాధ్యతలను గాలికొదిలేశారు. కనీసం ఏనాడూ రిజిస్ట్రేషన్ల మీద రివ్యూ, ఆడిట్ చేయలేదు. అత్యధిక రెవెన్యూని సంపాదించి పెడుతున్న రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ధరణి, భూ భారతి అమలు కాలాల్లో ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడమే ప్రధాన కారణమని ఆరోపించారు. స్లాట్ బుక్ కాగానే రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్ చేతిలో పెట్టడమే అధికారంగా భావించారు. కానీ ఇందులోని టెక్నికల్ ఇష్యూస్ గుర్తించకపోవడం బాధ్యతారాహిత్యంగా అభివర్ణిస్తున్నారు. సేల్ డీడ్, ఇతర డీడ్స్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేసినా, ఆటోమేటిక్ మ్యుటేషన్ చేసే టెక్నాలజీ ఉంది. ప్రస్తుతం నాన్ అగ్రికల్చర్ సేల్ డీడ్స్ చేయగానే ఆటోమేటిక్ మ్యుటేషన్ పూర్తవుతుంది. అదే ప్రక్రియను వ్యవసాయ భూములకు కూడా వర్తింపజేయడం ద్వారా రిజిస్ట్రేషన్ల వ్యవహారమంతా మునుపటి మాదిరిగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే పూర్తయ్యేదంటున్నారు. ఇలాంటి ఫేక్ చలాన్ల ఉదంతానికి అవకాశం ఉండేది కాదని వాదిస్తున్నారు. ప్రభుత్వం ఈ వ్యవహారంపై సునిశిత పరిశీలన చేయడం ద్వారా మెరుగైన వ్యవస్థ ఏర్పడుతుందంటున్నారు.

**మీసేవ నిర్వాహకులు మాత్రమే బాధ్యులా..?**

ఎవరో ఒకరు చేసిన తప్పుడు పని వల్ల తామందరినీ బద్నాం చేయడం సరైంది కాదని తెలంగాణ మీసేవా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ వాహిద్, ఎండీ మోహిన్, కే శ్రీనివాస్, సి.సత్యనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. సిటిజన్ లాగిన్ లోకి వెళ్లి ఎవరైనా స్లాట్ బుక్ చేసుకోవచ్చని,. ఆన్ లైన్ బ్యాంకింగ్ లేదా నేరుగా వెళ్లి చలానా కట్టే వీలుందని చెప్పారు. టెక్నికల్ నాలెడ్జ్ సరిగ్గా లేని వారు మాత్రమే స్లాట్ బుక్ చేసుకోవడానికి తమ దగ్గరికి వస్తారన్నారు. ప్రతి ట్రాన్సాక్షన్ లో చలానా, ఎండార్స్ మెంట్ డిటెయిల్స్ ను తహశీల్దార్లు పరిశీలిస్తే.. ఈ తేడాలకు అవకాశమే ఉండదన్నారు.

# గ్రామ పంచాయతీలకు మహర్దశ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎన్నికల నూతన సర్పంచ్‌లకు శుభవార్త చెప్పింది. ఇన్నాళ్లూ నిధులు లేక.. చిన్న చిన్న సమస్యలను తీర్చలేక సతమతవుతున్న గ్రామ పంచాయతీలకు నిధుల సమస్యను తీర్చనుంది. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.2500 కోట్ల పెండింగ్ నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ నెలాఖరు లోపు కనీసం రూ.వెయ్యి కోట్లను కేంద్రం విడుదల చేయనున్నట్లు తెలిసింది. మిగిలిన నిధులను వచ్చే నెలలో విడుదల చేసేందుకు అంగీకరించిందని తెలుస్తోంది. నిధుల రాగానే వాటిని వినియోగించుకునేందుకు మంత్రి సీతక్క ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ దృష్టిసారించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం అన్ని జిల్లాలకు మెమో జారీచేసింది. కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో డిజిటల్ ప్రక్రియను తప్పనిసరి చేసింది. 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి గ్రామపంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ఖాతాను పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఏజెన్సీ కోడ్ పొందాలి. అదే సమయంలో ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో కూడా ఆ వివరాలను నమోదు చేయాలి. నిధుల వినియోగానికి మేకర్, చెకర్‌గా వ్యవహరించే వారి డిజిటల్ సంతకాలను ఈ గ్రామ్ స్వరాజ్‌లో నమోదు చేసి సంబంధిత ఎంపీడీవో ద్వారా ఆమోదం పొందాల్సి ఉంటుంది.

**ఉప సర్పంచ్ కీ రోల్..**

గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ మేకర్‌గా, సర్పంచ్ చెకర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ ప్రక్రియకు క్లాస్-3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు తప్పనిసరి కాగా, సైనింగ్, ఎన్‌క్రిప్షన్ సౌకర్యంతో పాటు యూఎస్‌బీ టోకెన్ కూడా ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయిన తర్వాతే 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుందని పంచాయతీ రాజ్ శాఖ స్పష్టం చేసింది. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లా పంచాయతీల అధికారులు అవసరమైన డిజిటల్ సంతకాలను జీఈఎం పోర్టల్, ఈ ప్రొక్యూర్‌మెంట్ లేదా ఇతర టెండర్ విధానాల ద్వారా వెంటనే సేకరించి, నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓజా అన్ని జిల్లాల పంచాయతీల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**నిధుల కొరత తీరినట్లే..**

రాష్ట్రంలో గతంలో గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయలేదు. గతనెలలో ఎన్నికలు పూర్తవడంతో కేంద్రానికి నిధులు విడుదల చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అధికారులు నిరంతర సంప్రదింపులతో నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, కొత్త పనులు ప్రారంభం కానున్నాయి. కొత్త పాలకవర్గాల ఆధ్వర్యంలో గ్రామ సమస్యలు తీరనున్నాయి.

# వడ్డీల ఉరితాళ్లకు తల్లి కొడుకుల బలి



**బాపట్ల,ఫ్లాష్ ఇండియా :** పండుగ పూట ఓ ఇంట పెను విషాదం నెలకొంది. తల్లి కొడుకు ఆత్మహత్యకు యత్నించడంతో ఒక్కసారిగా ఆ గ్రామం ఉలిక్కిపడింది. ఈ హృదయ విదారక ఘటన బాపట్ల జిల్లా పరిధిలో వేటపాలెం మండలంలో ఉన్న శ్రీనివాసనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సుజాత (55) కుటుంబంతో కలిసి చీరాల కొట్ల బజారులో నివసిస్తున్నారు. ఆమెకు కొడుకు సాయి (24) ఉన్నారు. కొంత కాలం క్రితం సుజాత భర్త అనారోగ్యంతో మరణించారు. దీంతో చీరాల రైల్వే స్టేషన్ వద్ద కొడుకుతో కలిసి టిఫిన్ బండి నిర్వహిస్తున్నారు. అయితే వ్యాపార నిర్వహణలో భాగంగా అప్పులు పెరిగిపోయాయి. బాకీలు చెల్లించాలని వడ్డీ వ్యాపారులు తల్లి కొడుకుపై ఒత్తిడి పెంచారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక మనోవేదనకు గురైన సుజాత, ఆమె కుమారుడు సాయి ఆత్మహత్యకు యత్నించారు. శరీరంపై చమురు వంటి ద్రవాన్ని చల్లుకొని నిప్పంటించుకున్నారు. దీంతో తల్లి, కొడుకు శరీర భాగాలు మంటలకు కాలిపోయాయి. గమనించి స్థానికులు వెంటనే వారి వద్దకు చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం విషమ పరిస్థితుల్లో తల్లి కొడుకును ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తల్లి పరిస్థితి విషమంగా ఉందని.. బాధితులిద్దరికి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

# జిల్లాల పునర్విభజన చిక్కు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** జిల్లాల పునర్విభజనపై సీఎం చేసిన ప్రకటన రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లాల హేతుబద్ధీకరణపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చకు పెట్టి పార్టీల అభిప్రాయాలు తీసుకొని మార్గదర్శకాలు ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై సస్పెన్స్ నెలకొన్నది. సీఎం ప్రకటనతో రాజకీయ నాయకులు ఒక్కసారిగా సందిగ్ధంలో పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు జరుగుతాయా..? లేదా అనే సందేహాలు, అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జిల్లాల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలంటే ఈ ఏడాది చివరినాటికి సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకుండా ఆగుతారా..? లేదంటే ప్రస్తుతమున్న జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తారా..? అనే చర్చ మొదలైంది.

**గతంలో ఇలా..**

బీఆర్ఎస్ హయాంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించిన తర్వాత అనేక కొత్త మండలాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, కొత్త మండలాలకు ఎన్నికలు నిర్వహించలేదు. అవి కేవలం రెవెన్యూ మండలాలుగా మాత్రమే కొనసాగాయి. అక్కడ కొత్త పోస్టులు మంజూరు చేయలేదు. ఎండీపీవో పోస్టును క్రియేట్ చేయలేదు. కార్యాలయాన్ని సైతం ప్రారంభించలేదు. ఆ మండలానికి ప్రత్యేకంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎవరూ లేరు. ఉమ్మడి మండలానికి ఉన్న ఎంపీపీ, జెడ్పీటీసీలే కొనసాగారు. ఉమ్మడి మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీకాలం పూర్తయిన తర్వాత కొత్త మండలాలకు ఎంపీడీవో, స్టాఫ్‌ను, కార్యాలయాన్ని మంజూరు చేశారు. దీంతో అప్పట్లో కొత్త మండలాలు కేవలం రెవెన్యూ మండలాలుగానే మిగిలాయి. ఇక ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తే ఇప్పుడున్న జిల్లాలు, మండలాలుగానే వారీగానే నిర్వహించాలి. పునర్విభజన అనంతరం సైతం ప్రస్తుతం జరిగిన ఎన్నికల ప్రకారమే జిల్లా పరిషత్‌లు, ఎంపీపీలఅబ్రశ్రీశ్రీతో పంచాయతీరాజ్ వ్యవస్థ కొనసాగుతుంది. రెవెన్యూ, ఇతర శాఖల్లో మాత్రం మార్పు ఉంటుందని అధికారులు, నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

పంచాయతీరాజ్‌చట్టం సైతం ఇదే చెబుతుందని గుర్తుచేస్తున్నారు. ఒకసారి స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తర్వాత విభజన జరిగినా, విలీనం చేసినా ఐదేండ్ల తర్వాతే అవి అమల్లోకి వస్తాయని చట్టంలో స్పష్టంచేశారు. ఒకసారి పాలకవర్గాలు ఎన్నికయ్యాక వారు ఐదేండ్ల పాటు పాలించాల్సి ఉంటుందని, వారు కోర్టుకు వెళితే వారికే అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉందని అధికారులు విశ్లేషిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగితే మరో ఐదేండ్ల వరకు.. ప్రస్తుతమున్న జిల్లాలు, మండలాల ప్రకారమే పాలించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

**ఒక జిల్లాలోనివి మరో జిల్లాలోకి..**

పునర్విభజన చేపడితే ఒక జిల్లాలోని మండలాలు మరో జిల్లాలోకి.. ఒక మండలంలోని గ్రామాలు మరో మండలంలో కలిసే అవకాశం ఉంటుంది. ఇప్పుడే ఎన్నికలు నిర్వహిస్తే పాలనాపరంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఒకవేళ ఎన్నికల తర్వాత పునర్విభజన చేపడితే మండలాలు, గ్రామాలు వేరే ప్రాంతంలో కలిసిన పాత పాలకవర్గమే వాటిని పాలించాల్సి ఉంటుంది. కొత్త మార్పులన్నీ ఐదేండ్ల తర్వాతే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. దీని వల్ల పునర్విభజన ప్రభుత్వం అనుకున్నంత స్థాయిలో విజయవంతం అయ్యే అవకాశం ఉండదని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు జిల్లాల సంఖ్యను తగ్గించినా 31 జిల్లా పరిషత్ చైర్మన్‌లు పదవీకాలం ముగిసేవరకు కొనసాగనున్నారు.

# థయ్‌లాండ్‌లో ఘోర విషాదం..

- థాయ్‌లాండ్‌లో ఘోర విషాదం
- ట్రైన్‌పై క్రేన్ పడి 22 మంది మృతి
- హై-స్పీడ్ రైలు ప్రాజెక్టు పనులు జరుగుతుండగా ఘటన

**థయ్‌లాండ్ :** థయ్‌లాండ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. కదులుతున్న ప్యాసింజర్ రైలుపై ఒక్కసారిగా భారీ క్రేన్ కూలిపోయింది. ఈ ఘటనలో 22 మంది చనిపోగా.. 30 మందికి పైగా గాయపడ్డారు. దీంతో విషాదఛాయలు అలుముకున్నాయి.బ్యాంకాక్‌కు ఈశాన్యంగా 230 కి.మీ దూరంలో ఉన్న నఖోన్ రాట్చసిమా ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఉబోన్ రాట్చథని ప్రావిన్స్‌కు వెళ్తున్న రైలుపై క్రేన్ కూలిపోయింది. ప్యాసింజర్ రైలును ఢీకొట్టింది. దీంతో రైలు పట్టాలు తప్పి మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రస్తుతం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో ఇప్పటి వరకు 22 మంది చనిపోగా.. 30 మంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. హై-స్పీడ్ రైలు ప్రాజెక్టులో భాగంగా నిర్మాణ పనులు జరుగుతుండగా క్రేన్ కూలిపోయింది.రైల్లో మొత్తం 195 మంది ప్రయాణికులు ఉన్నారని రవాణా మంత్రి పిఫాట్ రచ్చకిత్రకాన్ తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు వెల్లడించారు. రైలు లోపల చిక్కుకున్న ప్రయాణికుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులో ఉన్నాయని చెప్పారు.

# బాసర నుండి భద్రాచలం వరకు..


**ఐనవోలు,ఫ్లాష్ ఇండియా :** ప్రాచీన శైవ క్షేత్రం ఐనవోలులో మల్లన్న జాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ( జనవరి 14 ) బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి కొండా సురేఖ. మూడు రోజుల జాతర బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని.. చిన్నపిల్లలు, వృద్ధులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు.ఆలయాల అభివృద్ధిపై చిత్తశుద్ధితో ప్రభుత్వం ముందుకు వెళుతోందని.. బాసర నుంచి భద్రాచలం వరకు ఆధ్యాత్మిక సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని అన్నారు కొండా సురేఖ. మల్లన్న జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా పారిశుధ్యం, మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎంతో పేరు ఉన్న ఐనవోలు ఆలయ అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు కొండా సురేఖ. ఐనవోలు ఆలయ అభివృద్ధి దేవాదాయ శాఖ నుండి 2కోట్లు కేటాయిస్తానని.. ఆలయ పరిసరాల్లోని భూములను సేకరించేందుకు నిర్ణయం తీసుకున్నామని అన్నారు.సమ్మక్క సారలమ్మ జాతరను 250 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. భక్తులు సమర్పించిన బంగారంతో ఆభరణాలు చేయించి దేవుళ్ళను ముస్తాబు చేస్తామని అన్నారు కొండా సురేఖ. గోదావరి వెంట ఉన్న ప్రతీ ఆలయాన్ని డెవలప్ చేస్తున్నామని.. సబ్ కమిటీ వేసి ఆలయాల అభివృద్ధిపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.పుష్కరాల నిర్వహణలో తెలంగాణ ముందుందని.. టూరిజంలో రాష్ట్రాన్ని నంబర్ 1గా నిలిపి, ఆదాయం పెంచుతామని అన్నారు కొండా సురేఖ.



# ట్రైన్లలో అందుబాటులోకి వెండింగ్ మెషీన్లు

**ఢిల్లీ:** రైలు ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వేస్ గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలో సుదూర ప్రాంతాలకు రైళ్లలో వెళ్లే ప్రయాణికుల ప్రధాన సమస్య అయిన నాణ్యమైన టీ, కాఫీ కొరతను తీర్చేందుకు అధునాతన వెండింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం - న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.సాధారణంగా ప్యాంట్రీ కార్లలో లేదా బయట ప్లాట్‌ఫారమ్‌లపై లభించే పానీయాల నాణ్యతపై ప్రయాణికులు అప్పుడప్పుడు అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు, విక్రయదారులకు ప్రత్యేకంగా రూపొందించిన 5 లీటర్ల సామర్థ్యం గల వెండింగ్ క్యాన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వెండింగ్ మెషీన్ల ద్వారా తయారవ్వడం వల్ల పానీయాల నాణ్యతలో స్థిరత్వం ఉండనుంది. థర్మల్ ఇన్సులేషన్ కలిగిన క్యాన్ల వల్ల ప్రయాణికులకు కాఫీ, టీలు ఎప్పుడూ వేడిగానే అందుతాయి. శీతల పానీయాల పంపిణీలో గరిష్ట స్థాయిలో పరిశుభ్రత పాటించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే, రైళ్లలో కూడా వెండింగ్ మెషీన్లు తీసుకురావడం పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉత్తరాదిలో బానిసలేనా?



**తమిళనాడు :** డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దేశవ్యాప్తంగా వివాదానికి తీశాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థులను ఇంగ్లీష్ చదవకుండా నిరుత్సాహపరుస్తూ, కేవలం హిందీ మాత్రమే చదవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శలు చేశారు. అలాంటి విధానాల కారణంగానే ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి.. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రజలు దక్షిణ భారతదేశానికి వలస రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇక, మీరు ఇంగ్లీష్ చదవొద్దని చెబుతున్నారు.. చదివితే నాశనం అవుతారని భయపెడుతున్నారు.. ఇలా చేస్తే మిమ్మల్ని బానిసలుగా మార్చినట్టే అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.కాగా, తమిళనాడులో విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన కారణమని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ స్పష్టం చేశారు. ఈరోజు ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలు తమిళనాడుకు వస్తున్నాయంటే, అది ఇక్కడి విద్యావంతులైన యువత వల్లే అని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో హిందీకి మాత్రమే పరిమితమైన విద్యా విధానం నిరుద్యోగాన్ని పెంచుతోందని ఆరోపించారు. దీనికి భిన్నంగా, తమిళనాడులో అమలవుతున్న ద్రావిడ మోడల్ బాలికలు- బాలురు అనే తేడా లేకుండా అందరికీ సమాన విద్య అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ విధానాలతో రాష్ట్రంలో అక్షరాస్యత రేటు పెరగడమే కాకుండా, మహిళల ఉద్యోగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని దయానిధి మారన్ వెల్లడించారు.అయితే, ఇంగ్లీష్ మీడియం చదవకపోతే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది, భాషపై ఆంక్షలు విధించడం అభివృద్ధి, ఉపాధికి అడ్డంకిగా మారుతుందని దయానిధి మారన్ వ్యాఖ్యానించారు. ఇక, ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. దయానిధి మారన్‌కు "బుద్ధి లేదని" విమర్శిస్తూ.. హిందీ మాట్లాడే ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేత తిరుపతి నారాయణన్ డిమాండ్ చేశారు. హిందీ మాట్లాడేవారిని చదువులేని, సంస్కారం లేని వారిలా చిత్రీకరించడం దురదృష్టకరం అన్నారు.ఇదిలా ఉంటే, దయానిధి మారన్ వ్యాఖ్యలకు డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ మద్దతుగా నిలిచారు. ఉత్తర భారతదేశంలో మహిళల హక్కుల కోసం పోరాడేవారు తక్కువగా ఉన్నారని తెలిపారు. ఇది రాష్ట్రాన్ని పాలించే పార్టీపై ఆధారపడి ఉంటుంది.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారు.. తమిళనాడులో మేము మహిళల కోసం పోరాడి, వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాం.. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కూడా అమలు చేశాం.. ప్రారంభం నుంచే మహిళా హక్కుల కోసం పని చేస్తున్నామని ఇళంగోవన్ చెప్పుకొచ్చారు. ఎంపీ దయానిధి మారన్ వ్యాఖ్యలతో హిందీ-ఇంగ్లీష్, ఉత్తరం- దక్షిణం మధ్య విద్య, ఉపాధి అంశాలపై రాజకీయ వివాదం మరింత తీవ్రంగా కొనసాగుతుంది.

# సికింద్రాబాద్ కార్పొరేషన్ పై రగడ..






**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు సికింద్రాబాద్ అస్తిత్వంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను విభజించి, కొత్తగా మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిపాదన ఇప్పుడు అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ముఖ్యంగా 220 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సికింద్రాబాద్‌ను విస్మరించి, మల్కాజిగిరి కేంద్రంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఆక్షేపిస్తోంది. సికింద్రాబాద్‌ను ఎలాగైనా ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పోరు సాగిస్తున్నారు. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యాచరణ తలపెట్టారు. అయితే, ఈ పోరాటం రాజకీయనేతల్లో అటు పార్టీల్లో చర్చ అంశంగా మారింది. సుమారు పది సంవత్సరాల పాటు తిరుగులేని అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, నాడు సికింద్రాబాద్ ఆత్మగౌరవం ఎందుకు గుర్తుకు రాలేదు? కేవలం ప్రతిపక్షంలోకి రాగానే ఈ ప్రాంత సెంటిమెంట్ గుర్తుకు రావడానికి కారణం రాజకీయ అవసరమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**చారిత్రక నేపథ్యం..**

చారిత్రక నేపథ్యన్ని పరిశీలిస్తే, 1806లో మూడో నిజాం సికిందర్ జా పేరు మీదుగా ఈ నగరం, 1950ల కాలంలోనే స్వయంప్రతిపత్తి కలిగిన మున్సిపల్ కార్పొరేషన్‌గా వెలుగొందింది. 1960వ దశకంలో పరిపాలనా సౌలభ్యం కోసం దీనిని హైదరాబాద్‌తో విలీనం చేసినప్పటికీ, సికింద్రాబాద్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును కాపాడుకుంటూ వచ్చింది. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి, అతిపెద్ద కంటోన్మెంట్ బోర్డు వరకు ఈ ప్రాంతం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంతం నుంచి కీలక నేతలు మంత్రులుగా బాధ్యతలు నిర్వహించినా, కంటోన్మెంట్ విలీనం లేదా సికింద్రాబాద్‌కు ప్రత్యేక కార్పొరేషన్ హోదా కల్పించడంలో సరైన చొరవ చూపలేదన్న విమర్శలు, ఇప్పుడు కాంగ్రెస్ నుండి బలంగా వినిపిస్తున్నాయి. నాడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి, ఇప్పుడు మల్కాజిగిరి పేరుతో విభజన జరుగుతుంటే రాద్ధాంతం చేయడం కేవలం క్రెడిట్ పాలిటిక్స్‌లో భాగమేనని అధికార పక్షం ఆరోపిస్తోంది.మరోవైపు బీఆర్ఎస్ నేతలు తమ వాదనను విభిన్నంగా వినిపిస్తున్నారు. సికింద్రాబాద్ అనేది కేవలం ఒక ప్రాంతం కాదని, అది ఒక సంస్కృతి అని, అటువంటి చారిత్రక నగరాన్ని కేవలం ఒక మున్సిపల్ సర్కిల్‌గా లేదా మరో కొత్త కార్పొరేషన్ కింద ఉప విభాగంగా మార్చడం అన్యాయమని వారు వాదిస్తున్నారు. కంటోన్మెంట్ విలీనం ద్వారా వచ్చే అదనపు భూభాగాన్ని కలుపుకొని సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా మార్చాలని వారు పట్టుబడుతున్నారు. కానీ, ఈ డిమాండ్ వెనుక ఉన్న చిత్తశుద్ధిని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఏ మార్పు చేయాలని తలపెట్టినా దానిని వ్యతిరేకించడం విపక్షాల సహజ లక్షణం అయినప్పటికీ, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అడుగు ముందుకు వేయని బీఆర్ఎస్, ఇప్పుడు సికింద్రాబాద్ కార్డును తెరపైకి తెచ్చి ప్రజల సానుభూతిని పొందాలని చూస్తోందని విమర్శలు వస్తున్నాయి.

# ఐదుగురు సర్పంచ్‌లపై కేసులు నమోదు

## విష ప్రయోగంతో 600 కుక్కలు మృతి..



**మాచారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల పరిధిలో మానవత్వం మంటగలిసే ఘటన చోటుచేసుకుంది. వీధి కుక్కల బెడద ఉందన్న నెపంతో ఏకంగా 600 కుక్కలను విషప్రయోగం చేసి చంపడం స్థానికంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ దారుణానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఐదు గ్రామాల సర్పంచ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాచారెడ్డి మండల పరిధిలోని భవానీపేట, ఫరీద్‌పేట, వాడి, పాల్వంచ, బందరామేశ్వర్ పల్లి గ్రామాల్లో గత కొన్ని రోజులుగా వీధి కుక్కల సంఖ్య పెరిగిందని, ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని స్థానిక సర్పంచ్‌లు భావించారు. ఈ క్రమంలో కుక్కలను నియంత్రించేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించాల్సింది పోయి, మూకుమ్మడిగా విషం పెట్టి చంపాలని నిర్ణయించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాదాపు 600 కుక్కలు ఈ విషప్రయోగానికి బలై మృత్యువాత పడ్డాయి. చేస్తున్నారు.. సుధా కొంగర సెన్సేషనల్ కామెంట్స్

**సీన్‌లోకి స్త్రే ఆనిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు**


ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో కుక్కలు మృతి చెందడంపై జంతు ప్రేమికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్ట్రే ఆనిమల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఈ ఘటనపై లోతుగా విచారణ జరిపి, ఆధారాలతో సహా మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పాలకవర్గాల అండదండలతోనే ఈ మారణహోమం జరిగిందని వారు వాపోయారు. ఈ మేరకు భవానీపేట, ఫరీద్‌పేట, వాడి, పాల్వంచ, బందరామేశ్వర్ పల్లి గ్రామాల సర్పంచ్‌లపై మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి.

# ఎలాంటి అవాంతరాలు తలెత్తవద్దు



**నిర్మల్ ,ఫ్లాష్ ఇండియా :** సీఎం పర్యటనలో ఎలాంటి అవాంతరాలు తలెత్తవద్దని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జనవరి 16 న జరగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక, వీఐపీ గ్యాలరీ, సభకు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను ఎస్పీ జానకి షర్మిల మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఎమ్మెల్యే , డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కలెక్టర్ అభిలాష్ అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, కాంగ్రెస్ నేతలు ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాలా చారి, ఆదిలాబాద్, కుమ్రం భీం- ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, శ్రీహరి రావు, శ్యాంనాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# అక్రమార్కుల తప్పిదాలకు రైతులే మూల్యం చెల్లించాలా..?



**జనగామ,ఫ్లాష్ ఇండియా :** లోటు ఫీజుల పేరుతో రైతులపై నోటీసుల వర్షం.. భూ భారతి స్కామ్‌కు సంబంధించిన బాధితులు ఒక్కొక్కరుగా బయటికి వస్తుండటంతో రైతుల గుండెలను కలచివేసే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కుంభకోణంలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో అక్రమార్కులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం ఉన్నప్పటికీ, అసలు బాధితులైన రైతులకు మాత్రం న్యాయం దక్కడం లేదన్న తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. స్కామ్‌కు కారణమైన వారి వద్ద నుంచి డబ్బులు రికవరీ చేయాల్సిన ప్రభుత్వం.. నిజాయితీగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులపైనే భారాన్ని మోపుతోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కామ్ నేపథ్యంలో లోటు స్టాంప్ డ్యూటీ, లోటు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలంటూ కేవలం మూడు రోజుల్లో డాక్యుమెంట్లు రెగ్యులర్ చేయించుకోవాలని రైతులకు నోటీసులు జారీ కావడం జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది.

**అన్ని నిబంధనలు పాటించి ప్రభుత్వానికి..?**

భూ భారతి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా తీసుకుని అక్రమార్కులు కోట్లకు కొల్లగొట్టితే, అన్ని నిబంధనలు పాటించి ప్రభుత్వానికి డబ్బులు చెల్లించిన రైతుల వద్దే మళ్లీ వసూలు చేయడమేంటని రైతులు నిలదీస్తున్నారు. జనగామకు చెందిన శ్రీభాష్యం రఘు అనే రైతు గత నెల 24వ తేదీన 17 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం మీసేవ కేంద్రంలో 10 డాక్యుమెంట్లకు చలాన్ ఫీజు చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పట్లో ప్రభుత్వానికి రావాల్సిన మొత్తాన్ని పూర్తిగా చెల్లించినప్పటికీ.. ఇప్పుడు అదే రైతుకు రూ. 8 లక్షల 55 వేల 577 రూపాయలు లోటు ఫీజు ఉందంటూ, ఆ మొత్తాన్ని మూడు రోజుల్లో చెల్లించి డాక్యుమెంట్లు రెగ్యులర్ చేయించుకోవాలని ఎమ్మార్వో కార్యాలయం నుంచి నోటీసులు రావడం ఆయనను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తోంది.

**జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బాధితుడు..?**

తప్పు చేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి తమలాంటి రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని బాధితుడు శ్రీభాష్యం రఘు ఆవేదన వ్యక్తం చేశారు. "మా ఇంట్లో దొంగతనం జరిగితే పోలీసులను ఆశ్రయిస్తారా అదే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాల ద్వారానే మీ వ్యవస్థలో దొంగతనం లేదా తప్పిదాలు జరిగితే, ఆ భారం మాపై వేయడం ఎంతవరకు న్యాయం?" అని ఆయన ప్రశ్నించారు. "మేం తప్పు చేయలేదు ప్రభుత్వానికే డబ్బులు చెల్లించాం.. అయినా మళ్లీ డబ్బులు కట్టమంటే ఎలా?" అంటూ బాధిత రైతుల వేదన వినిపిస్తోంది. ఈ భూ భారతి స్కామ్‌పై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమార్కుల వద్ద నుంచే డబ్బులు రికవరీ చేయాలని వేడుకుంటున్నామన్నారు.

# పండుగపూట ప్రమాదం..



**పాల్వంచ,ఫ్లాష్ ఇండియా :** పండుగ పూట జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. పాల్వంచ మండలం పునుగుల గ్రామం వద్ద బుధవారం ఉదయం వేగంగా వస్తున్న కారు ముందు వెళ్తున్న బైక్‌కు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారుతో పాటు బైక్ కూడా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. కారు చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన వారిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బసవన్నలే నేస్తాలు.. బతుకంతా కష్టాలు

## గంగిరెద్దుల ఆటకు ఆదరణ కరువు



**జనగామ,ఫ్లాష్ ఇండియా :** 'అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారి కి దండం పెట్టు.. వాళ్ల గొడ్డూ గోదా.. పిల్ల జెల్లా చల్లంగా ఉండాలని దీవించు..' అం టూ సంక్రాంతి వేళ ఇళ్ల ముంగిళ్లలోకి వచ్చే డూడూ బసవన్నల ఆశీర్వచనాలు కనుమరుగవుతు న్నాయి. ఒకప్పుడు సంక్రాంతి వచ్చిందంటే గొబ్బెమ్మలు.. రంగు రంగుల ముగ్గుల మధ్య గంగిరెద్దుల విన్యాసాలు పల్లెలకు కొత్త కళ తెచ్చేవి. మారుతున్న కాలంతో పాటు గంగిరెద్దుల సంస్కృతి పూర్తిగా అంతరించిపోతున్నది. గంగిరెద్దుల కళకు ఆదరణ లేకపోవడంతో ఆ కళనే నమ్ముకున్నవారి జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. గత్యంతరంలేక ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నారు. దీంతో నేటితరం పిల్లలకు గంగిరెద్దు అంటే ఎలా ఉంటుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పెరిగిన సాంకేతికతతో పండుగలు కళ తప్పుతు న్నాయి. సంక్రాంతి పండుగ అంటే గుర్తొచ్చే గంగిరె ద్దుల విన్యాసాలు కనుమరుగయ్యాయి. ఏళ్లకేళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా.. గంగిరెద్దుల ను ఆడించే వారిని పట్టించుకు నే వారు లేక.. ఆ సంచార జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. తాత.. ముత్తాతల నుంచి వస్తున్న ఆచారాలను వదు లుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనగామ జిల్లా ఖిలాషాపూర్‌లో నివాసముంటున్న బత్తుల శ్రీను, ఆవుదొడ్డి మహేష్, ఆవుదొడ్డి రాజు చెబుతున్నారు. గంగి రెద్దుల ఆట కోసం పది నెలల నుంచి నాలుగేళ్ల వయస్సు వరకు ఉన్న ఎద్దులను కొనుగోలు చేసి వాటికి నిత్యం పచ్చగడ్డి వేస్తూ ఆకు పసర్లతో తాము చెప్పే మాటలను వినే విధంగా తర్ఫీదునిస్తున్నారు. గుంటూరు, నవాబుపేట, కోదా డ, ఒంగోలు నుంచి రూ.40 వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించి ఎద్దులను కొనుగోలు చేసి మూడు నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆటకు సిద్ధం చేస్తామని బత్తుల శ్రీను తెలిపారు.

**ఆకట్టుకునేలా అలంకరణ**

ఆటకు వెళ్లే ముందు బసవన్నలను అందంగా అలంకరిస్తారు. రంగురంగుల జాకె ట్టు ముక్కలు, చీరలతో బొంతను తయారు చేసివాటిపై కప్పుతారు. ఈత చెట్టు కమ్మలతో చాపలు అల్లి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్ది కొమ్ములకు తొడుగు తారు. మెడకు గజ్జెల పట్టి, కాళ్లకు గజ్జెలు కడతారు. ఒక్కో గంగిరెద్దును అలంకరించేం దుకు సుమారు రూ.15 వేల వరకు ఖర్చు వస్తుందట. బసవన్నలకు శిక్షణ ఇచ్చేటప్పు డు వాటికి 'అలడగం' కూడా నేర్పిస్తామని,ఆటలు ఆడే సమయాల్లో ఎక్కువ డబ్బుల కోసం అలిగేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని శ్రీను తెలిపారు. గంగిరెద్దు మనిషి ఛాతిపై ఆడడం, గంగిరెద్దు నోట్లో మెడ పెట్టడం, మోకాళ్లపై కూర్చుని నడవడం వంటి ఆటలను కుడా నేర్పిస్తామని చెపా-ఏరు. ఎవరైనా చనిపోతే సమాచారం తెలుసుకుని గంగిరెద్దు విన్యా సాలు చేసి చూపిస్తు చనిపోయిన వారి కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసుకుంటామని తెలిపారు. సంచార జీవితాన్ని అనుభవిస్తున్న తమ కు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు చూపాలని గంగిరెద్దుల కళాకారులు కోరుతున్నారు.

**తాతల నుంచి ఇదే పని**

నా చిన్నప్పటి నుంచి గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్న.. మా తాత ముత్తాతల నుంచి ఇదే వృత్తి ఆచారంగా వత్తాంది. సావు.. బతుకులే మాకు బుక్కెడు బువ్వ కల్పిస్తయి.. సంక్రాంతి పండుగప్పుడే మా చేతిలో చాలా పైసలు కనిపిస్తయి. పొట్ట కూటి కోసం గంగిరెద్దుతో ఊరూరు తిరుగుతున్నం..

**కళను బతికించేందుకు పుట్టెడు కష్టాలు పడుతున్నాం..**

గంగిరెద్దులను ఆడించే కళను బతికించడానికి పుట్టెడు కష్టాలు పడుతున్నాం. గంగిరెద్దులతో సంచార జీవనం సాగిస్తు పొట్ట పోసుకుంటున్నాం. ఉండటానికి ఇల్లు.. తినడానికి తిండి.. కట్టుకోవడానికి బట్ట కూడా కరువైంది. ప్రభుత్వం మాకు ఆర్థిక సాయం అందించి అదుకోవాలి.

# పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి..

**వెల్గటూర్,ఫ్లాష్ ఇండియా :** పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి.. వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బలాటి శివ (18)అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారని బంధువులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివకు చదువు సరిగా అబ్బక గ్రామంలో బేవార్స్‌గా తిరిగేవాడు. తరుచుగా డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 9న రూ.20 వేలు కావాలని తల్లిని అడిగాడు. ప్రస్తుతం తన దగ్గర డబ్బులు లేవని తల్లి తిరస్కరించింది. తను అడిగిన డబ్బులు తల్లి ఇవ్వలేదని మనస్తాపానికి గురైన శివ క్షణికావేశంలో ఇంటిలోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో శివకు తీవ్రగాయాలు కావటంతో హుటాహుటిన అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ తరలించారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే నాలుగు రోజులపాటు చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. ఇతడిపై గతంలో గంజాయి కేసు కూడా ఉన్నట్లు సమాచారం.

# అరుదైన పుట్టగొడుగు



**జడ్చర్ల,ఫ్లాష్ ఇండియా :** జడ్చర్ల పట్టణం లో డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి చేస్తున్న తెలంగాణ బొటానికల్ గార్డెన్ లో అరుదైన పుట్టగొడుగు దర్శనమిచ్చింది. గార్డెన్ లోని నెట్ హౌస్ లో బాదం కాయలు మొలకెత్తడం కోసం ఏర్పాటు చేసిన గోనె సంచుల మీద ఈ పుట్టగొడుగు దర్శనమిచ్చింది. దీనిని కాప్రినొప్సిస్ నివియా గా తాత్కాలికంగా గుర్తించినట్టు గార్డెన్ సమన్వయకర్త డా బి సదాశివయ్య తెలిపారు. దీన్ని గుర్తించడానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రం రిటైర్డ్ ప్రొఫెసర్ డా. మనోహరాచారి సహకరించినట్టు సదాశివయ్య తెలిపారు. ఇది తేమతో కూడిన కుళ్ళిన పదార్థాల పైన పెరుగుతూ 1 లేదా 2 రోజుల్లోనే తన జీవితచక్రం ను ముగుస్తుందని పేర్కొన్నారు. దీని ఫలనాంగాలు మంచు రంగులో ఉండి మంచుతో కప్పబడి ఉండటం వల్ల దీనిని స్నోయి ఇంకాంప్ అని సాధారణంగా పిలుస్తారు. దీని ఫలనాంగాలు సుమారుగా 3 సెంటీమీటర్ వరకు పెరిగి ఒక్కరోజులోనే గొడుగువలె మారి నల్లని ద్రవంగా రూపాంతరం చెందుతాయి. భారతదేశం లో ఇప్పటివరకు దీన్ని పంజాబ్, అస్సాం రాష్ట్రాల్లో మాత్రమే గుర్తించారు. దక్షిణ భారత దేశంలో గుర్తించడం ఇదే మొదటిసారని డా. సదాశివయ్య వివరించారు. సదాశివయ్య ను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి సుకన్య అభినందించారు.

# నల్ల చెరువు కట్టపై పతంగుల పండుగ...

**కూకట్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** కూకట్‌పల్లి నల్ల చెర-ువులో బుధవారం పతంగుల పండుగ ఘనంగా నిర్వహించారు. పతంగుల పండుగ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. చిన్నారులతో, యువతతో కలిసి పతంగులు ఎగరేయడం తన యవ్వన జీవితాన్ని గుర్తు చేసిందని అన్నారు. 2024 సెప్టెంబర్‌లో నల్ల చెరువు అభివృద్ధి పనులను చేపట్టినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని అన్నారు. నల్ల చెరువు అభివృద్ధి చేసి నేడు పతంగుల పండుగను నిర్వహిస్తుంటే స్థానికులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, నల్ల చెరువు వద్ద పండుగ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. గతంలో కబ్జాకు గురై 16 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును కబ్జా చెర నుంచి రక్షించి 30 ఎకరాలకు విస్తరించడం జరిగిందని అన్నారు. చెరువులో 10 అడుగుల లోతు పేరుకు పోయిన పూడికను తొలగించి చెరువు నుంచి మురికిని తొలగించి శు భ్రమైన నీటితో నింపడం జరిగిందని అన్నారు. అదే విధంగా చెరువు లోతును పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరద సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పై మెరుగులు దిద్దడం కాకుండా చెరువుల అభివృద్ధి అంటే ఇలా ఉండాలని నిరూపించామని అన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉందని, మరిన్ని అందాలు సమకూర్చుతున్నామని అన్నారు. నల్ల చెరువుకు వాకింగ్ చేయడానికి కూకట్‌పల్లికి 5 కిలోమీటర్ల దూరం నుంచి సైతం వస్తున్నట్టు వాకర్స్ చెప్పడం ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు.

**ఎంతో ఆనందాన్ని ఇచ్చింది**

నల్ల చెరువులో షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్ అనేక క్రీడలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. అన్ని ప్రజలు ఉచితంగా వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అదే విధంగా హైడ్రా మొదటి విడతగా 6 చెరువులను అభివృద్ధి చేయడం జరిగిందని, అందులో బతుకమ్మకుంటను ప్రారంభించడం జరిగిందని అన్నారు. మరో 3 చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. వీటికి తోడు మరో 14 చెరువుల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. మిగిలిన చెరువుల అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. నగరంలో 100 చెరువులు అభివృద్ధి జరిగితే చాలావరకు వరదలను నియంత్రించవచ్చని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చుతున్నామని, దీంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా మంచి నీరు అందుబాటులోకి వస్తుందని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులో నేడు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిన్నారులతో కలిసి పతంగులు ఎగరేశారు. అనంతరం స్థానికులు రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వాకర్స్ అసోసియేషన్, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సమ్మె బాటలో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు.!




**మహబూబాబాద్,ఫ్లాష్ ఇండియా :** పండగపూట కూడా పస్తులే ఉండాలా... మాకు జీతాలు ఇవ్వరా అంటూ మానుకోట ఎన్హెచ్ఎం జేఏసీ డీఎంహెచ్వో రవి రాథోడ్ కు సమ్మె నోటీసులు ఇచ్చారు. గత నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నామని, కుటుంబ భారం తప్పడం లేదని చాలీచాలని జీతాలతో, ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా ఇబ్బందులు అనుభవించుకుంటూ ఉద్యోగం చేస్తున్నామని, ఇకనైనా ప్రభుత్వం జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 14 తేదీ (ఈ రోజు) నుండి 21 తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య ఆరోగ్య సేవలను కొనసాగించుకుంటూ సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది కలగకుండా నిరసనలు తెలియజేస్తామన్నారు. అలాగే 21వ తేదీ వరకు జీతం అందకపోతే 22 తేదీ నుండి సమ్మెకు దిగుతామని ఎన్ హెచ్ ఎం జాయింట్ యాక్షన్ కమిటీ డెడ్ లైన్ విధించింది. ఈ సమ్మె నోటీసులో మహబూబాబాద్ డిస్ట్రిక్ట్ ఎన్హెచ్ఎం నాయకులు, డీపీఓ, డీడీయంలు డోమాలజిస్ట్, వీసీసీఎం డీఈవోలు తదితరులు పాల్గొన్నారు.



# సొంతూళ్లకు జనం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నుంచి పలు ప్రాంతాల ప్రజలు సొంతూళ్లకు వెళ్లిపోవడంతో నగరంలోని రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఉండే రోడ్లన్నీ ఒక్కసారిగా నిర్మానుష్యంగా మారిపోయాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గత మూడు రోజులుగా భారీ సంఖ్యలో ప్రజలు తమ సొంతూళ్లకు వెళు తున్నారు. నగరంలోని మియాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ, మాదాపూర్, ఐటీ కారిడార్, ఎల్బీ నగర్, మణికొండ, పంజాగుట్ట, బంజారా హిల్స్, బేగంపేట తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. గత మూడు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో దాదాపు లక్షలాది మంది సొంతూళ్లకు వెళ్లారు. ప్రైవేట్ బస్సుల్లో .. ప్రత్యేక రైళ్లలోనూ సొంతూళ్లకు వెళ్లారు. నిత్యం బిజీగా కనిపించే హైటెక్‌సిటీ, ఐటీ కారిడార్, ఐకియా వంటి ప్రాంతాల్లో రోడ్లన్నీ బోసిపోయాయి.

# వలపు వల.. దంపతుల ఎర



**కరీంనగర్ ,ఫ్లాష్ ఇండియా :** బ్లాక్ మెల్ చేస్తున్న దంపతులను బుధవారం అరెస్ట్ చేశారు. కరీంనగర్ రూరల్ పోలీసులు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత రెండు సంవత్సరాల నుండి కరీంనగర్ పట్టణ పరిధిలోని ఆరేపల్లిలో గల శ్రీ సాయి అపార్ట్మెంట్‌లో భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఇన్స్టాగ్రామ్‌లో తమ వలపు ఫోటోలను పోస్ట్ చేసి సుమారు వంద మందికి పైగా ఎరా వేసినట్టు సీఐ తెలిపారు. ఇందులో బడా వ్యాపారస్తులు, య-ువకులు ఆమె బాధితులుగా మారారు అని తెలిపారు. ఆమె వలలో పడ్డవారికి తమ అపార్ట్మెంట్‌లోని రమ్మని మాయ మార్పించి ఆ త-రువాత వారు నగ్నంగా ఉన్న ఫోటోలను చిత్రీకరించి డబ్బులు ఇవ్వకపోతే వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని వారు బెదిరించేవారని సీఐ తెలిపారు. ఇది ఇలా ఉండగా కరీంనగర్‌కు చెందిన ఒక వ్యక్తి సంవత్సరం క్రితం నుండి ఆమె భర్తతో స్నేహం చేస్తూ వారి భార్యతో చనువుగా ఉండేవాడు. అతడి వద్ద నుండి కూడా డబ్బు భారీగా ఇవ్వాలని డిమాండ్ చేసేవారు.సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తామని బెదిరింపులు..అంతేకాకుండా పెద్ద మొత్తంలో లక్షల్లో డబ్బులు ఇవ్వాలని లేదంటే సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ చేస్తామని బాధితున్ని చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు అని సీఐ తెలిపారు. బాధితుడు మంగళవారం కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి ఏసీపీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సీఐ నిరంజన్ రెడ్డి ఎస్ఐలు లక్ష్మా రెడ్డి, నరేష్ వారి బృదంతో కలసి రెండు బృందాలుగా ఏర్పడి గాలిపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం కరీంనగర్‌లోని టేస్టీ దాబా వద్ద ఆగి ఫోన్ మాట్లాడుతుండగా.. అనుమాస్పదంగా కనిపించగా వారిని పట్టుకొని విచారించగా.. వారు జరిగిన విషయం మొత్తం చెప్పి నేరంను ఒప్పుకొని వారు కొన్న కారుతో పాటు మొబైల్ ఫోన్‌లో తీసిన నగ్న వీడియోలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందుతులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించగా వారిని 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. త్వరితగతిన కేసు ఛేదించడంతో సీఐ నిరంజన్ రెడ్డిని, ఎస్సైలు లక్ష్మా రెడ్డిని నరేష్ బృందాన్ని ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు. నేరస్తులు మంచిర్యాల జిల్లాకు చెందినవారని పోలీసులు గుర్తించారు.

# సౌకర్యాలు లేని అంగన్వాడీలు..



**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** ఇప్పటికైనా స్వంత భవనాలు కేటాయించాలి.. మాతా, శిశు సంరక్షణ, పేద పిల్లల విద్యాబోధనలో కీలకపాత్ర పోషించాల్సిన అంగన్వాడీ కేంద్రాలు సిబ్బంది కొరత, నిధుల లేమి, సొంత భవనాలు లేకపోవడం వంటి సమస్యలతో అస్తవ్యస్తంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ ఆదర్శ బస్తీ, దత్తనగర్ గాంధీ కుటీర్, విఠల్వాడీ అంగన్వాడీ కేంద్రాలు అనేక సమస్యలకు నిలయాలని దిశ క్షేత్ర పరిశీలనలో వెల్లడైంది. బాలామృతంలో భాగంగా కిషోర బాలికలకు, పిల్లలకు, గర్భిణీలకు గుడ్లు, పాలు, అన్నం--పప్పు, కూరగాయలతో పాటు సాయంత్రం మురుకులు అందిస్తున్నప్పటికీ నాణ్యమైన ఆహారం అందటం లేదని లబ్ధిదారులు తెలిపారు.

**అంగన్వాడీ కార్యకలాపాలపై దృష్టి పెట్టలేని పరిస్థితి..**

ప్రీస్కూల్, మైక్ పోయమ్ కిట్స్‌ను అన్ని కేంద్రాలకు అందించాలని వారు కోరారు. కాగా సిబ్బందిని ఎన్నికలు, జనాభా లెక్కలు వంటి పలు ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడం వల్ల పని భారం పెరిగి, అంగన్వాడీ కార్యకలాపాలపై దృష్టి పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుందని సిబ్బంది పేర్కొన్నారు. పనిభారం పెరిగినా 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వడం లేదని, హామీ ఇచ్చిన జీతాలను ఇప్పటి వరకు పెంచకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు సులభతరం కావడానికి ట్యాబ్‌లు అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.


# పాక్ సంతతి ఆటగాళ్ల వీసాల తిరస్కరణ..!




ప్రతిష్టాత్మక టీ20 ప్రపంచకప్ 2026.. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే ఈ టోర్నీ ముందు మరోసారి వివాదం చెలరేగింది. అమెరికా క్రికెట్ జట్టుకి ప్రాతినిధ్యం వహిస్తున్న పాకిస్తాన్ సంతతి ఆటగాళ్లకు భారత్ వీసాలు నిరాకరించిందన్న ప్రచారం కలకలం రేపింది. ఫిబ్రవరి 7న భారత్‌తో తొలి మ్యాచ్ ఆడాల్సిన యూఎస్ఏ జట్టుకు ఇంకా నెల కూడా సమయం లేకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అలీ ఖాన్, జహంగీర్, మహ్మద్ మోహ్సిన్, ఆదిల్.. అనే నలుగురు ఆటగాళ్లు ఈ జాబితాలో ఉన్నారు. అయితే భారత్ తన వీసా నిరాకరించిందనే అర్థం వచ్చేలా అలీ ఖాన్ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దీంతో వీసా తిరస్కరణ జరిగిందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. కానీ ఇది వాస్తవం కాదని తేలింది. వీసాలను నిరాకరించలేదని, ఇంకా జారీ ప్రక్రియ కొనసాగుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం యూఎస్ఏ జట్టు కొలంబోలో ఉంది. మిగతా సభ్యుల వీసా ప్రక్రియ అక్కడి భారత హై కమిషన్ ఆధ్వర్యంలో ముగిసింది. కానీ పాక్ సంతతికి చెందిన నలుగురు ఆటగాళ్ల వీసాల జారీలో మాత్రం జాప్యం నెలకొంది.'వారు శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఈ దశలో వీసాలను ప్రాసెస్ చేయలేమని ఆ ఆటగాళ్లకు సమాచారం అందింది. సాయంత్రం తరువాత, అమెరికా మేనేజ్‌మెంట్‌కు భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ వచ్చింది. అవసరమైన సమాచారంలో కొంతే అందిందని, విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఇంకా అదనపు సమాచారం రావాల్సి ఉంది' అని అధికారిక వర్గాలు తెలిపాయి.

# టోర్నీ వేదిక క్లీన్..

ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఇండియన్ ఓపెన్ వేదికపై వచ్చిన విమర్శలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఖండించింది. డెన్మార్క్‌కు చెందిన మియా బ్లిచ్‌ఫెల్డ్ ఈ టోర్నీ జరుగుతున్న ఇందిరా గాంధీ స్టేడియం ఏమాత్రం శుభ్రంగా లేదని, చాలా డర్టీగా ఉందంటూ విమర్శలు చేసింది. ఈ విషయంలో బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ఏడాది ఆగస్టులో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ కూడా ఇక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విమర్శలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దీనిపై స్పందించిన బాయ్ సెక్రెటరీ జనరల్ సంజయ్ మిశ్రా.. ఆమె చేసిన విమర్శలు టోర్నీ జరుగుతున్న వేదిక గురించి కాదన్నారు. 'ఆమె వ్యాఖ్యలు ఆడుతున్న పరిస్థితులు, వ్యక్తిగత ఆరోగ్యం గురించే. ఆడుతున్న యానెక్స్ సన్‌రైజ్ ఇండియా ఓపెన్ ఎరీనా గురించి కాదు. ఈ విషయాన్ని ఆమె కూడా స్పష్టంగా చెప్పారు' అని మిశ్రా వివరించారు. ట్రైనింగ్ జరిగిన కేడీ జాదవ్ స్టేడియం గురించి ఆమె మాట్లాడిందని, ప్రధాన టోర్నీ జరుగుతున్న ప్రాంతం పూర్తిగా శుభ్రంగా ఉందని చెప్పారు.



**ఆయుష్‌కు షాకిచ్చిన లక్ష్యసేన్**

ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీ ఆరంభంలోనే యంగ్ ప్లేయర్ ఆయుష్ శెట్టికి షాక్ తగిలింది. స్టార్ షట్లర్ లక్ష్యసేన్‌తో జరిగిన ఆయుష్ ఓటమి చవిచూశాడు. బెంగళూరులో వీరిద్దరూ చాలాకాలం ప్రాక్టీస్ పార్టనర్‌లుగా ఆడారు. ఈ అనుభవాన్ని లక్ష్య వాడుకున్నంత బాగా ఆయుష్ ఉపయోగించుకోలేకపోయాడు. దీంతో చివరకు 21-12, 21-15 తేడాతో పైచేయి సాధించాడు. ఈ ఓటమితో టోర్నీ నుంచి ఆయుష్ తప్పుకున్నాడు.



# ఒకే ఒక్క హాఫ్ సెంచరీ..

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య నేడు రెండో వన్డే జరగనుంది. రాజ్‌కోట్‌లో మధ్యాహ్నం 1.30 నుంచి మ్యాచ్ ఆరంభం కానుంది. తొలి వన్డేలో గెలిచిన భారత్.. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి సిరీస్ కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైయిపు మొదటి వన్డేలో ఓడిన న్యూజిలాండ్.. తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ ఓ రేర్ రికార్డు సాధించే అవకాశాలు ఉన్నాయి. విరాట్ కోహ్లీ ఇప్పటివరకు వరుసగా 5 వన్డేల్లో హాఫ్ సెంచరీలు చేశాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, రోహిత్ శర్మ, అజింక్య రహానేతో సమానంగా విరాట్ నిలిచాడు. కింగ్ మరో హాఫ్ సెంచరీ చేస్తే.. వరుసగా 6 మ్యాచుల్లో హాఫ్ సెంచరీలు బాదిన మొదటి భారత బ్యాటర్‌గా నిలుస్తాడు. కింగ్ సూపర్ ఫామ్ చూస్తే.. ఈరోజు సాధించే అవకాశాలు ఉన్నాయి. కోహ్లీ తన చివరి 5 వన్డేల్లో 156.33 యావరేజ్‌తో 469 పరుగులు బాదాడు. ఇందులో 2 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఆడిన రెండు మ్యాచుల్లో 131, 77 పరుగులు చేశాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో కూడా విరాట్ కోహ్లీ దుమ్ములేపాడు. 7 సార్లు 50 హాఫ్ సెంచరీలు చేశాడు. ఈ 7 ఇన్నింగ్స్‌ల్లో 135.4 యావరేజ్‌తో 677 రన్స్ బాదాడు. ఇందులో మూడు సెంచరీలు, నాలుగు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మొత్తంగా పాకిస్థాన్ మాజీ బ్యాటర్ జావెద్ మియాందాద్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నారు. ఆయన వరుసగా 9 హాఫ్ సెంచరీలు బాదారు. ఇమామ్ ఉల్‌హక్ 7 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నారు. రాస్ టేలర్, క్రిస్ గేల్, బాబర్ ఆజమ్, కేన్ విలియమ్సన్, షాయ్ హోప్, పాల్ స్టిర్లింగ్ వరుసగా ఆరు వన్డేల్లో హాఫ్ సెంచరీలు చేశారు.

# ఆయుష్ అరంగేట్రం..

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య ఈరోజు రెండో వన్డే మ్యాచ్ జరగనుంది. తొలి వన్డేలో విజయం సాధించిన టీమిండియా.. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని బలమైన ప్రదర్శన ఇవ్వాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు భారత జట్టులో ఒక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది. యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి ఈ మ్యాచ్‌తో భారత్ తరఫున అరంగేట్రం చేసే అవకాశం ఉంది. ఐపీఎల్‌లో నిలకడైన ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన బదోని.. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రతిభను చూపించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మ ఓపెనర్‌లుగా ఆడనున్నారు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చేయనుండగా.. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ ఆడనున్నాడు. వికెట్‌కీపర్‌గా కేఎల్ రాహుల్ ఆడుతాడు. ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, ఆయుష్ బదోనిలు ఆడనున్నారు. స్పిన్ విభాగాన్ని కుల్దీప్ యాదవ్ నడిపించనుండగా.. పేస్ విభాగంలో మొహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. మొత్తంగా సీనియర్, జూనియర్ కలయికతో భారత జట్టు మరోసారి న్యూజిలాండ్‌పై ఆధిపత్యం చెలాయించేందుకు సిద్ధమైంది. ఈరోజు అరంగేట్రం చేయనున్న ఆయుష్ ప్రదర్శనపై అందరి దృష్టి నెలకొంది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్



సుందర్ గాయం కారణంగా సిరీస్ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. అనుహ్యంగా ఆయుష్ బదోనికి సెలెక్టర్లు అవకాశం ఇచ్చారు. నేడు అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి. నితీశ్ రెడ్డి మరో ఆల్‌రౌండర్‌గా జట్టులో ఉన్నా.. బదోని వైపే టీమ్ మెనెజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దేశవాళీ క్రికెట్‌లో బదోనికి అద్భుతమైన రికార్డు ఉంది. లిస్ట్-ఎ క్రికెట్‌లో ఇప్పటివరకు 27 మ్యాచ్‌లు ఆడి.. 693 రన్స్, 10 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో లక్నో తరఫున మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు. బదోని ఆఫ్ బ్రేక్ బౌలింగ్ చేయగలడు. జడేజా మాదిరి మరో ఆల్‌రౌండర్‌గా బదోనిని చేయాలని మెనేజ్‌మెంట్ చూస్తోంది.

**భారత జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, ఆయుష్ బదోని, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్.

# భారీ మార్పులతో టీమిండియా..

భారత్, న్యూజిలాండ్ వన్డే సిరీస్ 2026లో రెండో మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. తొలి వన్డేలో విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉన్న టీమిండియా బుధవారం (జనవరి 14) రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగే రెండో వన్డేలో సిరీస్‌ను గెలుచుకునేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు జట్టులో కొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలి వన్డేలో వాషింగ్టన్ సుందర్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం టీమిండియాకు ఎదురుదెబ్బగా మారింది. అంతేకాదు తొలి మ్యాచ్‌కు ముందు రిషభ్ పంత్ గాయపడటంతో అతడిని కూడా జట్టు కోల్పోయింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు ఢిల్లీ యువ ఆటగాడు ఆయుష్ బదోనీని జట్టులోకి ఎంపిక చేశారు. అయితే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహానికి అనుగుణంగా ఆల్‌రౌండర్‌గా ఉపయోగపడే నితీశ్ కుమార్ రెడ్డికి అవకాశమివ్వాలని టీమ్ మేనేజ్మెంట్ భావిస్తున్నట్లు సమాచారం. వడోదరలో జరిగిన తొలి వన్డేలో భారత్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. చేజ్‌లో విరాట్ కోహ్లీ మరోసారి తన క్లాస్ చూపించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా 28,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అయితే సెంచరీకి కేవలం 7 పరుగుల దూరంలో ఔటయ్యాడు. కోహ్లీ అవుట్ అయిన తర్వాత భారత్ కాస్త ఒత్తిడిలో పడినప్పటికీ, కేఎల్ రాహుల్ మరోసారి ఫినిషర్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ రెండో వన్డే మ్యాచ్ నేడు (బుధవారం)





మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉండగా, జియో హాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడవచ్చు. ఇప్పటివరకు భారత్, న్యూజిలాండ్ మధ్య 121 వన్డేలు జరగగా, భారత్ 63 మ్యాచ్‌లు గెలవగా.. న్యూజిలాండ్ 50 విజయాలు సాధించింది. 7 మ్యాచ్‌లు రద్దు కాగా, ఒక మ్యాచ్ టైగా ముగిసింది.

**అంచనా జట్లు:**

**భారత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ (వికెట్‌కీపర్), రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.
**న్యూజిలాండ్:** విల్ యంగ్, డెవాన్ కాన్వే, హెన్రీ నికోల్స్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ హే (వికెట్‌కీపర్), మైఖేల్ బ్రేస్‌వెల్ (కెప్టెన్), క్రిస్టియన్ క్లార్క్, జకరీ ఫౌల్క్స్, కైల్ జేమీసన్, ఆదిత్య అశోక్.

# బిజినెస్



# భారీ నష్టాల నుంచి కాస్త కోలుకున్న సూచీలు..

గత కొన్ని సెషన్లుగా వరుస నష్టాలనే చూవి చూస్తూ వస్తున్న దేశీయ సూచీలు బుధవారం కూడా అదే ధోరణిలో ప్రారంభమయ్యాయి. అయితే ఆ తర్వాత కాస్త కోలుకున్నాయి. అయినప్పటికీ ఇంకా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా అనుకూల సంకేతాలు, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సూచీలు భారీ నష్టాల నుంచి తేరుకున్నాయి. ఇతర ఆసియా మార్కెట్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. గత సెషన్ ముగింపు (83, 627)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 300 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరో వంద పాయింట్లు కిందకు దిగింది. అయితే ఆ తర్వాత కాస్త కోలుకుంది. ప్రస్తుతం ఉదయం 10:10 గంటల సమయంలో సెన్సెక్స్ 190 పాయింట్ల నష్టంతో 83, 471 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 60 పాయింట్ల నష్టంతో 25, 660 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో హిందుస్థాన్ జింక్, వేదాంత, ఆయిల్ ఇండియా, లారస్ ల్యాబ్స్, నాల్కో మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. కోటక్ మహీంద్రా, కల్యాణ్ జువెల్లర్స్, టాటా ఎలాక్సీ, ప్రెస్టీజ్ ఎస్టేట్, పాలీక్యాబ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 164 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 164 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 90.14గా ఉంది.

# బేబీ ప్రొడక్ట్స్ రీకాల్...




ప్రముఖ ఆహారపదార్థాల కంపెనీ నెస్లే (Nestl) తాజాగా కొన్ని ప్రోడక్ట్స్ ను రీకాల్ చేయడం కలకలం రేపుతోంది. జనవరి 6న నెస్లే కొన్ని రకాల బేబీ ఫార్ములా పాల ప్రొడక్ట్స్‌ను గ్లోబల్ స్థాయిలో రీకాల్ చేసింది. అంతేకాదు తాము ప్రకటించిన ప్రొడక్ట్స్ ను కొనకూడదు, అమ్మకూడదు అంటూ నేడు మరో ప్రకటన జారీ చేసింది. ఇప్పటికే యూరప్‌తో పాటు ఆస్ట్రేలియా, కెనడాతో సహా మొత్తం 25 నుంచి 60 దేశాల్లో బేబీ ఫార్ములా మిల్క్ ప్రొడక్ట్స్ అమ్మకాలను ఉన్నపళంగా నిలిపివేసి, రీకాల్ చేపట్టారు. దీంతో అసలు నెస్లేలో ఏం జరుగుతుందో తెలియక ఆయా ప్రోడక్ట్స్ వాడుతున్న ప్రజలు ఆందోళన గందరగోళానికి గురవుతున్నారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

బేబీ ఫార్ములాలో బ్యాసిలస్ సెరియస్ అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే సెరూలైడ్ టాక్సిన్ ఉండే అవకాశం ఉందన్న అనుమానంతో ఈ రీకాల్ చేశారని నిపుణులు చెబుతున్నారు. ఈ టాక్సిన్ వల్ల చిన్న పిల్లల్లో వాంతులు, విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు వస్తున్నట్టు కంపెనీ దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. రీకాల్ చేసిన బ్రాండ్లలో SMA, BEBA, NAN, Guigoz, Lactogen Harmony, Alfamino వంటి టాప్ మిల్క్ పౌడర్లు ఉన్నాయి. ఈ ప్రొడక్ట్స్ ను తక్షణమే వెనక్కి పంపాలని, వీటిని ఇప్పటికే వాడుతున్నవారు పక్కన పెట్టాలని నెస్లే విన్నవించింది.

**భారత్ పై ఎఫెక్ట్ ఎంత?**

భారత్‌లో ఇప్పటివరకు రీకాల్ సమాచారం లేకపోయినా.. గ్లోబల్ రీకాల్ కావడంతో FSSAI పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. భారత్‌లో ఈ ప్రొడక్ట్స్ వాడుతున్న తల్లిదండ్రులు బ్యాచ్ నంబర్, ఎక్స్‌పైరీ తేదీలను తప్పకుండా చెక్ చేయాలని సూచించింది. నెస్లే ప్రకటించిన బ్యాచ్ ఉంటే వెంటనే వాటిని వాడకుండా రిటర్న్ చేయాలి లేదా పారేయాలని పేర్కొంది. శిశువుల ఆరోగ్యం అత్యంత కీలకం కాబట్టి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అత్యంత భారీగా పెరిగిన ధరలు..



అన్నట్టుగానే సిల్వర్ 3 లక్షల మార్కు దాటేసింది. గతేడాది వెండి ధరలు విలయ తాండవం చేస్తే.. ఈ ఏడాది అంతకు మంచి సునామీ సృష్టిస్తోంది. తాజాగా వెండి ధర ఆల్‌టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ఈరోజు కిలో వెండిపై రూ.15,000 పెరిగి ఏకంగా రూ.3, 07,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. దీంతో కొనుగోలుదారులు వామ్మో అంటూ హడలెత్తిపోతున్నారు. అలాగే బంగారం ధర కూడా టాప్ లేపుతోంది. ఈరోజు తులం గోల్డ్‌పై రూ.1,090 పెరిగింది. మొత్తానికి సంక్రాంతికి వెండి, బంగారం ధరలు మోత మోగిస్తున్నాయి. ఈరోజు ఏకంగా కిలో వెండిపై రూ.15,000 పెరిగింది. దీంతో రికార్డ్ స్థాయిలో ధర దూసుకుపోతుంది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,90, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.3,07,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి ధర రూ.2,90, 000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఈరోజు తులం గోల్డ్‌పై రూ.1,090 పెరగగా బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,620 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,000 పెరగగా రూ.1,31,650 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.820 పెరగగా రూ.1,07,720 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# భారత జీడీపీ వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ





బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

# మరిన్ని దేశాలకు యూపీఐ విస్తరణ

మనదేశ స్వదేశీ డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ని మరిన్ని దేశాలకు విస్తరించడంపై దృష్టి సారిస్తున్నట్టు ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు తెలిపారు. అంతర్జాతీయ ఉనికిని విస్తృతం చేస్తూ, ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ముఖ్యంగా తూర్పు ఆసియా మార్కెట్లలో యూపీఐ పరిధిని విస్తరించడంపై దృష్టి సారిస్తోందన్నారు. మంగళవారం జరిగిన గ్లోబల్ ఇంక్లూజివ్ ఫైనాన్స్ ఇండియా సమ్మిట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం దేశంలో యూపీఐ ద్వారా లావాదేవీలు సుమారు 50 శాతం డిజిటల్ రూపంలో జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని దేశాలకు యూపీఐని విస్తరించాం. ఇప్పుడు మరిన్ని దేశాలకు, ముఖ్యంగా తూర్పు ఆసియాపై దృష్టి సారిస్తున్నామని అన్నారు. యూపీఐ ఇప్పటికే ఎనిమిది దేశాలలో-భూటాన్, సింగపూర్, ఖతార్, మారిషస్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), శ్రీలంక, ఫ్రాన్స్- అందుబాటులో ఉంది. దీనివల్ల భారతీయ ప్రయాణికులు యూపీఐని ఉపయోగించి విదేశాలలో డిజిటల్ చెల్లింపులు చేయడానికి వీలవుతోందని నాగరాజు చెప్పారు. గతేడాది డిసెంబర్‌లో యూపీఐ లావాదేవీలు 2,100 కోట్లకు పైగా జరిగాయని నాగరాజు తెలిపారు. ఇది దేశంలో



డిజిటల్ చెల్లింపుల వేగాన్ని సూచిస్తుందన్నారు. ఇదే సమయంలో దేశంలో కొన్ని కోట్ల మైక్రో యూనిట్ సంస్థలు ఉన్నప్పటికీ, అవి మధ్య తరహా, పెద్ద సంస్థలుగా ఎదగడం లేదని అభిప్రాయపడ్డారు. మైక్రో యూనిట్లను మధ్య తరహా సంస్థలుగా మార్చాల్సిన అవసరం ఉందని ఎం నాగరాజు స్పష్టం చేశారు. మైక్రో సంస్థలకు మద్దతు, మార్కెట్ యాక్సెస్, సాంకేతికతతో పాటు హార్డ్‌వేర్ ద్వారా ఉత్పాదకత లాభాలు లభించినప్పుడే ఇది జరుగుతుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు.




## బాక్సాఫీస్ వద్ద మెగా ర్యాంపేజ్..

సంక్రాంతి కానుకగా విడుదలైన "మన శంకర వర ప్రసాద్ గారు" చిత్రం మొదటి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లను రాబడుతోంది. మొదటి రోజు ఏకంగా 84 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక రెండో రోజు బాక్సాఫీస్ వద్ద మరింత ఊపు అందుకుంది. రెండు రోజులు ముగిసేసరికి ఈ చిత్రం మొత్తం వసూళ్లు 120 కోట్ల రూపాయల మార్కును చేరుకుంది. ఇందుకు సంబంధించి తాజాగా చిత్ర బృందం ఓ పోస్టర్ ను రిలీజ్ చేసింది.కేవలం థియేటర్ల దగ్గరే కాకుండా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్స్‌లో కూడా ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. గత 24 గంటల్లో బుక్ మై షో లో ఏకంగా 4 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. దీన్ని బట్టి చూస్తే మెగాస్టార్ మ్యానియా ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం పెద్ద ప్లస్ పాయింట్. సంక్రాంతి సెలవులు ఇప్పుడే మొదలవ్వడంతో, రాబోయే మూడు నాలుగు రోజుల్లో ఈ వసూళ్లు మరింత భారీగా పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, నయనతారల కెమిస్ట్రీతో పాటు అనిల్ రావిపూడి మార్క్ కామెడీ పండటంతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు.



## అసలైన విజయం ఇప్పుడే దక్కింది..

తెలుగు వెండితెరపై అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన అచ్చతెలుగు అమ్మాయి శ్రీలీల. కెరీర్ స్టాటింగ్ లోనే అగ్ర హీరోల సరసన అవకాశాలు అందుకుంటూ, తన ఎనర్జిటిక్ డ్యాన్సులతో కుర్రకారును ఉర్రూతలూగించింది ఈ ముద్దుగుమ్మ. ఇప్పుడు తన కెరీర్‌లో ఒక కీలక మైలురాయిని చేరుకుంది. ఇప్పటి వరకు శ్రీలీల అంటే కేవలం గ్లామర్, డ్యాన్స్‌లకే పరిమితం అనే ముద్ర ఉండేది. కానీ, తాజాగా విడుదలైన ఆమె తమిళ చిత్రం 'పరాశక్తి' ఆ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ సినిమాతో కేవలం కమర్షియల్ హీరోయిన్‌గానే కాకుండా, నటనకు ఆస్కారమున్న పాత్రల్లోనూ తను రాణించగలనని నిరూపించుకుంది. అయితేతాజాగా జరిగిన ఒక వేడుకలో శ్రీలీల మాట్లాడుతూ.. ఈ గుర్తింపు పట్ల ఎంతో భావోద్వేగానికి గురైంది.. 'ఎప్పుడూ నా పాటలు, డ్యాన్సుల గురించే మాట్లాడేవారు.. కానీ మొదటిసారి నా నటన గురించి గొప్పగా మాట్లాడుతుంటే చాలా ఆనందంగా ఉంది. పరిశ్రమ నుంచి వస్తున్న ఈ ప్రశంసలే నాకు దక్కిన అసలైన విజయం' అని చెప్పుకొచ్చింది. తమిళంలో విజయవంతంగా అడుగుపెట్టిన శ్రీలీల, త్వరలోనే హిందీ చిత్ర పరిశ్రమలోకి కూడా ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. నటిగా తనను తాను నిరూపించుకున్న ఈ సమయంలో, మరిన్ని పవర్ ఫుల్ పాత్రలు ఆమెను వరిస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు.

## తమన్నా సినిమాకు గ్యాంగ్‌స్టర్ ఫ్యామిలీ వార్నింగ్..



బాలీవుడ్ వెర్సటైల్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఓ రోమియో'. విశాల్ భరద్వాజ్ -- షాహిద్ కపూర్ కాంబోలో 'కమీనే', 'హైదర్ల వంటి హిట్ల తర్వాత వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. తమన్నా తో పాటు తృప్తి డిమ్రి, నానా పటేకర్, విక్రాంత్ మాస్సే వంటి స్టార్స్ నటిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 13న విడుదల కావాల్సి ఉంది. కానీ ఇప్పుడు లీగల్ చిక్కుల్లో ఇరుక్కుంది. ముంబైకి చెందిన దివంగత గ్యాంగ్‌స్టర్ హుస్సేన్ ఉస్తారా జీవితం ఆధారంగా ఈ సినిమాను రూపొందించారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో, ఆయన కుమార్తె సనోబర్ షేక్ చిత్ర యూనిట్‌కు షాకిచ్చారు.తన తండ్రి పాత్రను సినిమాలో తప్పుగా చూపిస్తూ తమ కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ దర్శకుడు విశాల్ భరద్వాజ్, నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలాకు లీగల్ నోటీసులు పంపారు. అంతే కాదు తమ అభ్యంతరాలు తీరే వరకు సినిమా విడుదలను నిలిపివేయాలని, లేనిపక్షంలో రూ. 2 కోట్లు పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేయడం బాలీవుడ్‌లో సంచలనంగా మారింది. ఇక టీజర్‌లో షాహిద్ కపూర్ పవర్‌ఫుల్ గన్‌మెన్‌గా కనిపించడం, అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో హుస్సేన్ ఉస్తారాకు ఉన్న వైరాన్ని సినిమాలో చూపిస్తున్నారనే ప్రచారం ఈ వివాదానికి కారణమైంది. మరి ఈ లీగల్ నోటీసులపై చిత్ర బృందం ఎలా స్పందిస్తుందో, సినిమా సకాలంలో థియేటర్లకు వస్తుందో లేదో చూడాలి.




## పది షోలు మాత్రమే ఇస్తామన్నారు

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో నవీన్ పోలిశెట్టి నటించిన లేటెస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' సంక్రాంతి కానుకగా నేడు (జనవరి 14) థియేటర్లలోకి వచ్చేసింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించగా, మారి దర్శకత్వం వహించారు. వరంగల్‌లో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌తో మొదలైన జోరు, నేడు విడుదల తర్వాత సోషల్ మీడియాలో వినిపిస్తున్న పాజిటివ్ టాక్‌తో మరింత రెట్టింపు అయ్యింది. ఈ నేపథ్యంలో తన కెరీర్ మొదట్లో పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ నవీన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ విడుదల సమయంలో మాకు కనీసం షోలు కూడా దొరకని పరిస్థితి. కేవలం 10 షోలు మాత్రమే ఇస్తామన్నారు. కానీ ప్రేక్షకులు ఆ సినిమాను భుజాల మీద మోసి పెద్ద హిట్ చేశారు. ఆ నమ్మకమే నేడు నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. సినిమా ఆలస్యమైనా సరే, ప్రేక్షకులకు నాణ్యమైన వినోదాన్ని పంచాలనే ఉద్దేశంతోనే కష్టపడ్డామని, ప్రత్యేక షోలు చూసిన ప్రతి ఒక్కరు కడుపుబ్బ నవ్వుకున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మరో బంపర్ ఆఫర్ అందుకున్న రాషా థడానీ..



స్టార్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ త్వరలో టాలీవుడ్ లో అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. ఘట్టమనేని వారసుడు జయకృష్ణకు జంటగా ఆమె నటించనున్న తొలి తెలుగు సినిమా 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభమై ఉండగా, విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. ఇక ఈ సినిమా విడుదలకు ముందే రాషా థడానీకి మరో క్రేజీ ఆఫర్ దక్కింది. బాలీవుడ్ లో ఆమె కొత్త సినిమాను ప్రకటిస్తూ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'లైకీ లైకా' అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అభయ్ వర్మ హీరోగా నటిస్తుండగా, రాషా థడానీ హీరోయిన్ గా కనిపించనుంది.ఈ రొమాంటిక్ డ్రామాను సౌరభ్ గుప్తా దర్శకత్వం వహించనుండగా, ఫాంటమ్ స్టూడియోస్ బ్యానర్ పై ఈ సినిమా రూపొందుతోంది. షూటింగ్ జూన్ నెలలో ప్రారంభం కానున్నట్లు సమాచారం.ఇటీవల విడుదలైన 'లైకీ లైకా' ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రేమ, హింస రెండూ కలిసిన కథను సూచించేలా రూపొందించిన ఈ పోస్టర్ లో హీరో, హీరోయిన్ బూట్లపై రక్తపు మరకలు కనిపిస్తూ ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. ఇది సాధారణ రొమాంటిక్ కథ కాదని, తీవ్రమైన సంఘర్షణలతో కూడిన కథను ఈ సినిమా చెప్పబోతోందన్న సంకేతాలు ఇస్తోంది. ఈ ఏడాది సమ్మర్ కానుకగా 'లైకీ లైకా' ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఒక సినిమా విడుదల కాకముందే మరో భారీ ఆఫర్ దక్కించుకోవడం రాషా థడానీ క్రేజ్ కు నిదర్శనంగా మారింది.

## రూ.4 కోట్ల నుంచి 18 కోట్లకు..

తాజాగా వచ్చిన 'మన శంకర్ వరప్రసాద్ గారు'లో నటించారు. ఈ సినిమా కోసం రూ.18 కోట్లు అడిగారట. ఒక్కసారిగా అవాక్కయిన డైరెక్టర్ అనిల్ రావిపూడి.. నయన్‌ను కన్విన్స్ చేసి తక్కువ పేమెంట్‌కే ఫిక్స్ చేశారని టాక్. పేమెంట్ తక్కువ చేయడమే కాదు.. నయనతారతో అనిల్ ప్రమోషన్స్ కూడా చేయించారు. ఇది గొప్ప విషయమే అనే చెప్పాలి. ఎందుకంటే.. నయన్ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటారన్న విషయం తెలిసిందే. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ నుంచి ఎస్కేప్ అయ్యారు. తాను నయన్‌ను ఒప్పించేందుకు స్వ-యంగా రంగంలోకి దిగనని అనిల్ రావిపూడి చెప్పిన విషయం తెలిసిందే.మన శంకర్ వరప్రసాద్ గారు కన్న ముందే నయనతార మొదలు పెట్టిన మూకుత్తి అమ్మన్ 2కి మాత్రం రూ.12 కోట్లు ఛార్జ్ చేస్తుందని సమాచారం. ఈ సినిమాను వంద కోట్లతో తెరకెక్కిస్తున్నాయి నాలుగు ప్రొడక్షన్ హౌసెస్. మాలీవుడ్ చిత్రాలకు రూ.10-12 కోట్ల లోపు ఛార్జ్ చేస్తున్న నయన్.. పాన్ ఇండియా సినిమాలంటే మాత్రం రెమ్యునరేషన్ విషయంలో తగ్గేదేలే అంటున్నారు. కేజీఎఫ్ హీరో యశ్ అప్ కమింగ్ ఫిల్మ్ 'టాక్సిక్లలో నయన్ నటిస్తున్నారు. గంగ పాత్రలో అటు గ్లామర్.. ఇటు యాక్షన్ అవతార్‌లో నటిస్తున్న లేడీ సూపర్ స్టార్.. ఈ క్యారెక్టర్ కోసం రూ.18 కోట్లు అడిగారట. ఈ సినిమాకున్న డెప్త్, ఆ క్యారెక్టర్‌కు ఉన్న ఇంటెన్సిటీని దృష్టిలో పెట్టుకుని రూ.15 కోట్లకు టీం ఫైనల్ చేసిందన్నది లేటెస్ట్ టాక్. మొత్తానికి క్రేజ్ ఉన్నప్పుడే డిమాండ్ చేయాలన్న కాన్సెప్ట్ పెట్టుకున్నట్లున్నట్లు ఉన్నారు నయన్.





## ఆ సినిమా కథ నచ్చి ఆ పాత్ర చేశాను..

స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదర గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ఇచట వాహనాలు నిలుపరాదు' మూవీతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. ప్రజెంట్ నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న 'అనగనగా ఒకరాజు' మూవీలో యాక్ట్ చేస్తుంది. మారి దఅబశ్రీశ్రీర్శఅబశ్రీశ్రీకఅబశ్రీశ్రీత్వం వఅబశ్రీశ్రీహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటఅబశ్రీశ్రీర్‌టైన్ మెంట్స్ బ్యానర్ నిర్మిస్తున్నది. అలాగే శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది.మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టఅబశ్రీశ్రీర్‌గా పఅబశ్రీశ్రీనిచేస్తున్నాడు. అయితే మూవీ నేడు థియేటర్లలో రిలీజ్ అయింది. ఈ క్రమంలో హీరోయిన్ మీనాక్షి చౌదరి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ చిన్నది మాట్లాడుతూ.. 'లక్కీ భాస్కర్ చిత్రంలో దుల్కర్ సల్మాన్‌కు భార్యగా నటించినందుకు నాకు ప్రశంసలు లభించాయి.కానీ కొందరు స్నేహితులు నన్ను భయపెట్టారు. కెరీర్ స్టార్టింగ్‌లోనే ఇలా భార్యగా, బిడ్డకు తల్లిగా నటించకపోవడం చాలా మంచిదని చెప్పారు. ఎందుకంటే నువ్వు ఇలాంటి పాత్రలు చేయడం స్టార్ట్ చేస్తే నిన్ను అమ్మ, అక్క పాత్రలకే పరిమితం చేస్తారని అన్నారు. అయితే లక్కీ భాస్కర్ సినిమా కథ నచ్చి తల్లి క్యారెక్టర్ చేశాను. ఇక అటువంటి పాత్రలు వస్తే చేయలేనని చెప్తాను' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

## సినిమా టీమ్‌కు బెల్లంకొండ బెస్ట్ విషెస్..



టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తోన్న చిత్రాల్లో 'నారి నారి నడుమ మురారి' ఒకటి. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, సాక్షి వైద్య హీరోయిన్లుగా నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర తెరకెక్కిస్తున్నారు.అయితే ఈ సినిమా నేడు థియేటర్లలో రిలీజ్ అయింది. ఈ క్రమంలో యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఈ మూవీకు బెస్ట్ విషెస్ తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ ట్వీట్ చేశారు. 'ఈ రోజు విడుదలైన నారి నారి నడుమ మురారి నిర్మాతలకు శుభాకాంక్షలు. శర్వానంద్, సంయుక్త మీనన్ మరియు సాక్షి వైద్యలకు శుభాకాంక్షలు. నిర్మాత అనిల్ సుంకర గారికి శుభాకాంక్షలు. ముందుకు సాగుతున్న విజయవంతమైన చిత్రానికి శుభాకాంక్షలు' అంటూ రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**